Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 | సంచిక : 182 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 24 జూలై 2024 | బుధవారం | పేజీలు : 4

## భారత పరీక్షా వ్యవస్థ ఒక మోసం

న్యూఢిల్లీ : భారత పరీక్షా వ్యవస్థ ఒక మోసమని.. డబ్బుంటే దాన్ని కొనేయవచ్చని చాలామంది నమ్ముతున్నారని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షం భావన కూడా అదేనని ఆయన స్పష్టం చేశారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు తాము నీట్ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతూనే ఉంటామని తేల్చిచెప్పారు. "మన పరీక్షా వ్యవస్థలో తీవ్ర సమస్య ఉందని దేశం మొత్తానికీ తెలుసు. కానీ, మంత్రి (కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్రప్రధాన్) తనను తప్ప అందరినీ నిందిస్తున్నారు. ఇక్కడ జరుగుతున్నదానికి సంబంధించి మౌలిక విషయాలు కూడా ఆయనకు తెలుసని నేను అనుకోను. జరుగుతున్న పరిణామాల పట్ల లక్షలాది మంది విద్యార్థులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. భారత పరీక్షా వ్యవస్థ ఒక మోసమని వారు విశ్వసిస్తున్నారు. బాగా డబ్బు ఉంటే.. భారత పరీక్షా వ్యవస్థను కొనేయవచ్చని నమ్ముతున్నారు. ఇక్కడ ప్రతిపక్షంలో ఉన్నవారి భావన కూడా అదే" అని రాహుల్ లోక్‌సభలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# వికసిత్ భారత్ లక్ష్యంగా...

# నిర్మలమ్మ 'పద్దు'



## సామాన్యులు - మధ్యతరగతి మెచ్చేలా కేంద్ర బడ్జెట్

దిల్లీ: మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలు, వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్. 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా ఈ బడ్జెట్‌ను రూపొందించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన- నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన- ఆవిష్కరణలు, తయారీ-సేవలు, తర్వాత తరం సంస్కరణలు అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు నిర్మలమ్మ ప్రకటించారు.

**కేంద్ర బడ్జెట్‌లో కీలక ప్రకటనలివే..** స్టాండర్డ్ డిడక్షన్ రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంపు. కొత్త పన్ను విధానం శ్లాబుల్లో మార్పులు. సున్నా నుంచి రూ.3 లక్షల వరకు ఎలాంటి పన్ను లేదు. మొబైల్ ఫోన్లు, మొబైల్ పీసీడీఏ, మొబైల్ ఛార్జర్లపై విధించే బేసిక్ కస్టమ్స్ డ్యూటీ 15 శాతానికి తగ్గింపు. బంగారం, వెండిపై దిగుమతి సుంకం 6 శాతానికి తగ్గింపు. ప్లాటినమ్‌పై 6.4శాతానికి కుదింపు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 3 కోట్ల అదనపు ఇళ్ల నిర్మాణం. అర్బన్ హౌసింగ్ కోసం ఐదేళ్లలో రూ.2.2 లక్షల కోట్లు కేటాయింపు. పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే కార్మికుల కోసం అద్దె గృహాల నిర్మాణం. పీపీపీ విధానంలో డార్మిటరీ తరహా ఇళ్ల నిర్మాణం. ముద్రా రుణాలు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంపు. బడ్జెట్‌లో గ్రామీణ అభివృద్ధికి రూ.2.66 లక్షల కోట్లు కేటాయింపు. ప్రకృతి వ్యవసాయంలోకి దేశవ్యాప్తంగా కోటి మంది రైతులను తీసుకొచ్చే ప్రణాళిక. 5 రాష్ట్రాల్లో కిసాన్ క్రెడిట్ కార్డులు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి రూ.1.5 లక్షల కోట్లు. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు నైపుణ్యాల శిక్షణ. 500 పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌లు. దేశీయ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్యార్థులకు రూ.10 లక్షల వరకు విద్యా రుణాలు. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.11.11 లక్షల కోట్ల కేటాయింపు. జీడీపీలో ఇది 3.4 శాతానికి సమానం. మహిళలు, బాలికల కోసం రూ.3 లక్షల కోట్లతో పథకాలు. విద్య, ఉపాధి,

**నైపుణ్యాలభివృద్ధికి రూ.1.48 లక్షల కోట్లు :** ఎంపిక చేసిన నగరాల్లో స్ట్రీట్ ఫుడ్ హబ్‌ల ఏర్పాటు. రాష్ట్రాల మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రూ.1.5 లక్షల కోట్లతో దీర్ఘకాల వడ్డీ రహిత రుణాలు. నిరుద్యోగులకు మూడు ఉద్యోగ అనుసంధాన ప్రోత్సహకాలు. సంఘటిత రంగంలోకి ప్రవేశించిన తొలిసారి ఉద్యోగులకు ఒక నెల వేతనం మూడు వాయిదాల్లో గరిష్ఠంగా రూ.15 వేలు చెల్లింపు. నెలకు గరిష్ఠంగా రూ. లక్ష లోపు వేతనం ఉన్నవారు అర్హులు. దీనివల్ల 210 లక్షల మంది యువతకు లబ్ధి చేకూరుతుంది. పీఎం స్వనిధి కింద వంద నగరాల్లో ప్రత్యేక వారాంతపు సంతలు ఏర్పాటు. క్యాపిటల్ గెయిన్స్ విధానం సరళీకరణ. దీర్ఘకాల లాభాలపై 12.5శాతం పన్ను. స్టార్టప్‌లకు ప్రోత్సాహకం.. ఏంజెల్ ట్యాక్స్ రద్దు.

1. వ్యవసాయం 2. ఎంప్లాయిమెంట్ 3. అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి 4. ఉత్పత్తి, సర్వీసు రంగాలపై ఫోకస్ 5. పట్టణాభివృద్ధి, స్మార్ట్ సిటీస్ 6. ఇంధన రంగం 7. మౌలిక వసతుల కల్పన 8. రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్, కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం 9. రాబోయే తరానికి తగ్గట్టు సంస్కరణలు

**2024- 25 కేంద్ర బడ్జెట్ 4 అంశాలపై దృష్టి పెట్టింది.**

1. పేదలను పేదరికం నుంచి ధనవంతులను చేయటం 2. ఉద్యోగ, ఉపాధి కల్పనపై దృష్టి పెట్టటం. 3. రైతుల వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటం.. పెట్టుబడి సాయంతోపాటు మద్దతు ధర కల్పించటం 4. మహిళల రక్షణ, మహిళా సాధికారిత దిశగా అడుగులు

**రైతులు, యువత లక్ష్యంగా ఈ బడ్జెట్ రూపకల్పన జరిగింది.** ఉద్యోగులు, యువతలో స్కిల్ డెవలప్ మెంట్ దిశగా అడుగులు వేస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో 4 కోట్ల ఉద్యోగాలే లక్ష్యం ఉద్యోగాలు,స్కిల్,ఎస్ఎంఎస్ ఈలపై ఫోకస్. బడ్జెట్ లో రైతులు, యూత్ పై ఎక్కువ పోకస్ పెట్టాం. బడ్జెట్ లో యూత్ కు 2 లక్షల కోట్లు కేటాయించాం. యువతకు 1.48 లక్షల యువతకు ఉద్యోగలిచ్చాం. 4 అంశాలపై బడ్జెట్ లో దృష్టి పెట్టాం. ప్రజల మద్దతును మర్చిపోలేం. మోదీ నేతృత్వంలో చారిత్రాత్మక బడ్జెట్. మేము రైతులకు మద్దతు ధర పెంచాం. పీఎం అన్న యోజన పథకం ఐదేండ్లు పెంచాం.



## అసెంబ్లీకి రానున్న కేసీఆర్ ఇక అధికార పార్టీకి చుక్కలే ?

బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమి తర్వాత అసెంబ్లీకి రాబోతున్నారు కేసీఆర్. బడ్జెట్ రోజున అసెంబ్లీకి రానున్నారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. బడ్జెట్ సమావేశంలో పాల్గొనాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారట. ప్రతిపక్ష నేతగా మొట్టమొదటిసారిగా అసెంబ్లీ సమావేశాలకు హాజరు కానున్నారు. ఈ మేరకు పార్టీ నేతలకు కూడా ఈ విషయాన్ని తెలిపారు. ఇందులో భాగంగానే.. ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం అయ్యారు కేసీఆర్.

కాగా, తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రారంభం కాగా. దివంగత ఎమ్మెల్యే లాస్య నందితకు సభ్యులు సంతాపం తెలియజేశారు.

అనంతరం సభ వ్యవహారాల కమిటీ భేటీలో అసెంబ్లీ నిర్వహణ, చర్చించాల్సిన అంశాలపై ప్రభు త్వం నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశాల్లో స్కిల్ యూనివర్సిటీ, ధరణి పోర్టల్ సమస్యల పరిష్కారానికి సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.



## కేంద్ర బడ్జెట్‌లో రైతులకు గుడ్ న్యూస్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టారు. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం మిగిలిన 8 నెలల కాలానికి వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. మధ్యంతర బడ్జెట్‌లో నాలుగు ఆంశాలపై దృష్టి సాధించామని.. అందులోని అన్ని పథకాలు ప్రస్తుతం కొనసాగిస్తున్నామని.. ఈ క్రమంలోనే?రైతుల పంటలకు మద్దతు ధరలు కల్పించే?ప్రధానమంత్రి అన్న యోజన పథకాన్ని ఐదేళ్ల పొడిగిస్తున్నట్లు ప్రకటించారు.ఈ బడ్జెట్ లో మొత్తం తొమ్మిది రంగాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆమె ప్రకటించారు. అలాగే వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చామని.. నూనె గింజలు, పప్పు ధాన్యాల ఉత్పత్తి పెంపునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా కూరగాయల ఉత్పత్తి కోసం క్లస్టర్లు అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. మొత్తానికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ. 1.52 లక్షల కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.




## ఎక్కువ కేటాయింపులు ఈ రంగాలకే!

# తెలంగాణ బడ్జెట్‌కు సర్వం సిద్ధం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను ఈ నెల 25న(గురవారం) అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెడతారు. ఈసారి బడ్జెట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు ప్రయారిటీ ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు స్పష్టంగా చెబుతున్నారు. ఈసారికి ఈ నాలుగు రంగాలకే కేటాయింపులు ఎక్కువగా ఉంటాయని కాంగ్రెస్ పార్టీ వర్గాలు అంటున్నాయి. రాష్ట్రానికి ఆదాయ మార్గాలు పరిమితంగా ఉన్నప్పటికీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో రాజీ పడే ప్రసక్తే లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఆరు గ్యారంటీల అమలు, ఉద్యోగాల భర్తీకి కూడా బడ్జెట్‌లో ప్రయారిటీ ఉంటుందనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఆర్థిక వనరుల సమీకరణలో ఇబ్బందుల దృష్ట్యా ఈసారి మౌలిక సౌకర్యాల కల్పన, సాగునీటి ప్రాజెక్టులు, మూలధన వ్యయం తదితరాలకు ఎక్కువగా కేటాయింపులు ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. వైద్య రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచుతారని భావిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. దానికి అనుగుణంగా కేటాయింపులను పెంచే ఛాన్స్ ఉంది. రాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం, కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుపై ఫోకస్ చేసే అవకాశం ఉంది. విద్యారంగానికి రేవంత్ సర్కారు ప్రయారిటీ ఇస్తోంది.

ఇందులో భాగంగా పెద్దఎత్తున టీచర్ల రిక్రూట్‌మెంట్ చేస్తోంది. ప్రభుత్వ పాఠశాల లేని పంచాయతీ ఉండొద్దని సీఎం రేవంత్ అంటున్నారు. సమీకృత రెసిడెన్షియల్ విద్యాసంస్థలతో పాటు సెమీ-రెసిడెన్షియల్, అంగన్‌వాడీలను ప్రాథమిక పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసే దిశగా కసరత్తును మొదలుపెట్టారు. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చే ప్రాసెస్ మొదలైంది. ఈనేపథ్యంలో విద్యారంగ వికాసానికి కేటాయింపులు పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలోని రైతులకు చేరువయ్యే ప్రయత్నంలో కాంగ్రెస్ సర్కారు ఉంది. అందుకే రైతులను రుణ విముక్తులను చేసేందుకు ప్రభుత్వం రుణమాఫీని అమలు చేస్తోంది. దీనికి సంబంధించిన తొలిదశను జులై 18న లాంఛనంగా సీఎం ప్రారంభించారు. ఇప్పటికే రూ.లక్ష వరకు రుణం ఉన్న రైతులకు రూ.6,098 కోట్లను విడుదల చేశారు. ఈ నెలాఖరుకు రూ.లక్షన్నర వరకు రుణాలను మాఫీ చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది. పంద్రాగస్టు నాటికి మొత్తం 60 లక్షల రైతు కుటుంబాలకు అప్పుల భారం లేకుండా చేస్తామని సీఎం రేవంత్ అంటున్నారు. ఆ మేరకు ఈసారి బడ్జెట్‌లో భారీ కేటాయింపులు ఉంటాయని అంచనా వేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలుకు నోచుకోలేకపోయిన ఫసల్ బీమా యోజన, జల్‌జీవన్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన లాంటి కొన్ని పథకాల కింద కేంద్రం నుంచి వచ్చే నిధులను సైతం వినియోగించుకోవాలని రేవంత్ సర్కారు భావిస్తోంది.రాష్ట్ర బడ్జెట్‌లో ఈ పథకాల అమలుపై ప్రకటన చేసే అవకాశం ఉంది. ఈ ఏడాది మొదట్లో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎస్సీలకు రూ.21,874 కోట్లు, ఎస్టీలకు రూ. 13,013 కోట్లు, బీసీలకు రూ. 8,000 కోట్లు, మైనారిటీలకు రూ. 2,262 కోట్లు కేటాయించారు.

ఈసారి కూడా అదే ఒరవడిని కొనసాగించాలని రేవంత్ సర్కారు భావిస్తోంది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు అవసరమైన నిధులను కేటాయించనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోని నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలతో పాటు కల్వకుర్తి, బీమా, కోయిల్‌సాగర్, డిండి, ఎస్సెల్బీసీ తదితర ప్రాజెక్టులకు కేటాయింపులు జరిగే ఛాన్స్ ఉంది. భారీ ఖర్చుతో కూడిన ఇరిగేషన్ ప్రాజెక్టుల జోలికి ఈసారి తెలంగాణ ప్రభుత్వం వెళ్లే అవకాశం లేదు.

# సంపాదకీయం

## బంగ్లాదేశ్ 'పాఠం'.. భారత్‌కు కూడా!!

భారత దేశానికి అత్యంత మిత్రపక్షంగా ఉన్న బంగ్లాదేశ్.. మన దేశ సరిహద్దులను పంచుకోవడమే కాదు.. మన సంస్కృతి, సంప్రదాయాలను కూడా పంచుకుంటున్న విషయం తెలిసిందే. పేరుకు ముస్లిం కంట్రీ అయినా.. బౌద్ధానికి, జైన మతాలకే కాదు.. హిందూత్వకు గత మూడు దశాబ్దాల కాలంలో బంగ్లాదేశ్ ప్రాధాన్యం ఇస్తోంది. అంటే.. ఒకరకంగా.. భారత్‌కు పొరుగు దేశం మాత్రమే కాదు.. మిత్ర దేశం కూడా. అయితే.. గత నాలుగు మాసాలుగా ఇక్కడ జరుగుతున్న రిజర్వేషన్ రగడ.. నింగినంటిన విషయం... పోలీసులకు-ఉద్యమకారులకు మధ్య పెద్ద ఎత్తున వివాదాలు చెలరేగిన విషయం తెలిసిందే. దీనికి కారణం.. రిజర్వేషన్లను రాజకీయాలకు ముడిపెట్టి.. పెంచుకుంటూ పోవడమే. తాజాగా బంగ్లాదేశ్ సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు ఇవ్వక ముందు వరకు కూడా.. దేశంలో రిజర్వేషన్లను గమనిస్తే.. రాజకీయ ప్రాపకం ఎంతుందో అందరికీ తెలుస్తుంది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు వేసిన.. రిజర్వేషన్ పాచికలు.. గత రెండు దశాబ్దాలుగా.. దేశాన్ని అట్టుడికిస్తు న్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్నాళ్లుగా దేశంలో హింస చెలరేగింది. ఉద్యోగాలకు సంబంధించిన రిజర్వేషన్లపై ఉద్యోగులే రంగంలో కి దిగి తెలిపిన నిరసన, ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. దీంతో ప్రధాని హసీనా నేతృత్వంలోని ప్రభుత్వం ఆర్మీని రంగంలోకి దింపి.. ఆందోళన కారులను అణచివేసింది. అయినా.. ఉద్యమ కారులు శాంతించలేదు. రిజర్వేషన్లను ఎత్తేయాలని.. ఉన్న తక్కువ ఉద్యోగాలను రాజకీయ ప్రాపకంతో కొంద రికే కేటాయిస్తే.. మా పరిస్థితి ఏంటని లక్షల మంది ఢాకా వీధుల్లో అర్ధనగ్న ప్రదర్శన చేసిన ఘట్టం జాతీయ స్థాయిలోకాదు.. అంతర్జాతీయ స్థాయిలో కూడా దుమారం రేపింది. కర్ఫ్యూ పెట్టినా.. కాల్పులు జరిపి.. 110 మందికిపైగా ఆందోళన కారులను కాల్చి చంపినా.. వారు వెనక్కి తగ్గలేదు. మొత్తానికి రిజర్వేషన్ల వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని.. సంచలన తీర్పు ఇచ్చింది. ఫలితంగా ఇప్పుడు బంగ్లాదేశ్ కొంత వరకు శాంతించినా.. ఈ పరిణామాలు.. భారత్‌కు కూడా పాఠం కానున్నాయి. భారత్‌లోనూ పలు రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యతల నేపథ్యంలో విచ్చలవిడిగా రిజర్వేషన్లను ప్రకటిస్తున్నాయి. ఫలితంగా ఉద్యోగార్థుల విషయంలో ఇది.. పెను వివాదంగా మారుతోంది. బిహార్, ఏపీ, యూపీ సహా.. అనేక రాష్ట్రాల్లో రిజర్వేషన్ అంశం వివాదంగానే ఉంది. ఇటీవల ఎన్నికలకు ముందు పశ్చిమ బెంగాల్‌లో ఓ తెగకు రిజర్వేషన్ కల్పించి.. ఇచ్చిన ప్రమోషన్లు, ఉద్యోగాలను కూడా.. సుప్రీంకోర్టు తిప్పికొట్టింది. వీటి ద్వారా మెజారిటీగా ఉన్న వారికి అన్యాయం జరుగుతుందని తేల్చి చెప్పింది. 50 శాతానికి మించి రిజర్వేషన్లను అమలు చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. సో.. పొరుగున ఉన్న బంగ్లాదేశంలో జరిగిన విధ్వంసం.. తర్వాత సుప్రీంకోర్టు తీర్పు వంటివి గమనిస్తే.. భారత్‌కు కూడా ఇవి గుణపాఠాలే కావాలి!!

**బంగ్లాదేశంలో రిజర్వేషన్ ఇలా..** ం ఓపెన్ కేటగిరీలో: 44% ం సమరయోధుల కుటుంబాలకు: 30% ం మహిళలకు: 10% ం వెనుకబడిన జిల్లాలకు: 10% ం మైనారిటీలు: 5% ం దివ్యాంగులకు: 1% సుప్రీం

**కోర్టు తీర్పు తర్వాత..** ం ఓపెన్ కేటగిరీలో: 93% ం సమరయోధుల కుటుంబాలకు: 5% ం దివ్యాంగులు, మైనారిటీలకు: 2% ం వెనుకబడిన జిల్లాలకు: ఎత్తేసింది.

# ప్రజలకు మరింత మెరుగ్గా వైద్య సేవలు అందించాలి

## పల్లె దవాఖానాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించండి...

### ఆరోగ్య జిల్లా దిశగా సరైన కార్యాచరణతో ముందుకు సాగాలి : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం








జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : ఆరోగ్య సమస్యలు మొదట్లోనే పసిగట్టగలిగితే దీర్ఘకాలిక రోగాలకు తావివ్వకుండా తొలి దశలోనే వాటిని రూపుమాపగలగవచ్చని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. ఘట్కేసర్ లోని ఏరియా ఆసుపత్రిలో పేషంట్లకు అందించే సేవలను మరింత విస్తృతం చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం సంబంధిత అధికారులకు సూచించారు. పల్లె దవాఖానాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించే దిశగా సిబ్బంది కృషి చేయాలని వైద్య సిబ్బందికి కలెక్టర్ సూచించారు. మంగళవారం కలెక్టర్ ఘట్కేసర్ ఏరియా ఆసుపత్రి ని సందర్శించి పేషంట్లకు అందించే సేవలను మరింత విస్తృతం చేయాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలో ఉన్న విభాగాలు పరిశీలించి వాటి పనితీరును డాక్టర్లతో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిని తనిఖీ చేస్తూ రెండు ల్యాబ్ రిజిస్టర్లను ధృవీకరించి, సిహెచ్ సి ఘట్‌కేసర్ మరియు పీహెచ్సీ ఉప్పల్‌లో ఈ ఎల్ ఐ ఎస్ ఏ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు. ముక్కు చెవ్వు గొంతు విభాగానికి ఓపి సేవలను పెంచాలని డాక్టర్లను సూచించారు. డెలివరీ పేషెంట్‌తో ఇంటరాక్ట్ అయ్యి, వారి ఆరోగ్యం మరియు బర్త్ డోస్ టీకాల గురించి అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ విభాగాన్ని పరిశీలించి, సంబంధిత సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న రోగుల సంఖ్య గురించి ఆరా తీశారు. బ్లడ్ బ్యాంక్‌ని సందర్శించి స్టాక్ లభ్యతను తనిఖీ చేసారు. బ్లడ్ కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టరు సూచించారు. మేల్, ఫీమేల్ వార్డులను సందర్శించి వైద్యులు అందించే సేవల గురించి పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ రఘునాథస్వామి, ఘట్కేసర్ మున్సిపల్ ఛైర్పర్సన్ పావని, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భోజనంలో తప్పనిసరిగా నాణ్యత పాటించాలి : ప్రత్యేక అధికారి సైదులు

## బొమ్మరాశి పేటలోని ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు వడ్డించిన భోజనం నాణ్యతగా లేదని ఉపాధ్యాయుల పై అసహనం వ్యక్తం చేసిన ప్రత్యేక అధికారి






శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సైదులు హెచ్చరించారు. మంగళవారం శామీర్ పేట మండలం బొమ్మరాశిపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి పాఠశాలలను, ప్లాంటేషన్ ను, పలు వీధులను, నర్సరీని మండల ఎంపీడీవో మమతాబాయితో కలిసి ప్రత్యేకాధికారి సైదులు ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల్లో మధ్యాహ్న భోజనం సమయంలో ప్రత్యేకాధికారి వెళ్లి పరిశీలించగా విద్యార్థులకు పెట్టిన కూర నాణ్యతగా లేదని, విద్యార్థులు తినడం లేదని స్వయంగా ప్రత్యేకాధికారి తనిఖీలో బయటపడింది. విద్యార్థులు సైతం కూరలు సరిగ్గా ఉండడం లేదని స్వయంగా ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మండల ప్రత్యేకాధికారి ఆ పాఠశాల ఉపాధ్యాయులపై, మధ్యాహ్న భోజన కార్మికులపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు రుచికరమైన, నాణ్యతతో కూడిన భోజనాలు పెట్టాలని, మళ్ళీ ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని పాఠశాల ఉ పాధ్యాయులను, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రత్యేకాధికారి హెచ్చరించారు. మెను ప్రకారం ఖచ్చితంగా నాణ్యతతో కూడిన భోజనం పెట్టాలని ఉపాధ్యాయులను హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంగన్వాడి కేంద్రానికి వెళ్లి విద్యార్థుల సంఖ్య వారికి అందజేస్తున్న పౌష్టికాహారం, గర్భిణీలు ఎంతమంది ఉన్నారని, ఎంతమందికి పౌష్టికాహారం అందజేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆ గ్రామ పరిధిలో నాటిన ప్లాంటేషన్ ను, నర్సరీని ప్రత్యేకాధికారి సందర్శించి పరిశీలించారు. ఎక్కడ ఖాళీ స్థలం ఉన్న మిగిలిన మొక్కలన్నిటిని నాటాలని సిబ్బందికి సూచించారు. ఆ గ్రామంలోని పలు వీధులను, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. వీధుల్లో, రోడ్లపై విచ్చల విడిగా చెత్త వేయరాదని, రోడ్ల పక్కన వర్షం నీరు, మురికి నీరు నిలువ కుండ జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ కార్యదర్శిని ప్రత్యేకాధికారి ఆదేశించారు. ప్రస్తుతం వర్షాకాలం అయినందున గ్రామంలో శానిటేషన్ పనులు సక్రమం గా చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే ప్రజలు వ్యాధుల బారీన పడుతారని కార్యదర్శికి సూచించారు. శానిటేషన్ పనుల పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శిని, సిబ్బందిని ప్రత్యేకాధికారి సైదులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ రావు , సిబ్బంది పాల్గొన్నారు.

# స్మిత సబర్వాల్ పోస్ట్ కలకలం.. నగరంలో దివ్యాంగుల నిరసన - బహిరంగ క్షమాపణలకు డిమాండ్



హైదరాబాద్: సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ సోషల్ మీడియా పోస్ట్ సోమవారం నగరంలో అలజడి సృష్టించింది. సివిల్స్ పోస్టుల ఎంపికలో దివ్యాంగుల కోటా అవసరమా? అని ఆమె తన వ్యక్తిగత 'ఎక్స్' ఖాతాలో చేసిన పోస్ట్‌పై పలు సంఘాలు భగ్గుమన్నాయి. జాతీయ వికలాంగుల హక్కుల వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, అడివయ్య ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నిరసన వ్యక్తం చేశారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని, అంగవైకల్యం కలిగిన అనేకమంది అద్భుతాలు సృష్టిస్తున్న విషయం సీనియర్ అధికారి స్మితా సబ ర్వాల్‌కు తెలియదా అని ప్రశ్నించారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ దివ్యాంగులు ఒంటరి వారు కాదని, వారిజోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. స్మితా సభర్వాల్ దివ్యాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఉమ్మడి ఏపీ దివ్యాంగుల సంస్థ చైర్మన్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా డిమాండ్ చేశారు. దివ్యాంగుల పట్ల చిన్నచూపు చూడడం తగదని ఆయన సూచించారు. అహంకారపూరిత పోస్ట్ చేసిన స్మితను చట్టప్రకారం శిక్షించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఛత్రినాక పోలీసులకు ఫిర్యాదు :** దివ్యాంగుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యానించిన స్మితా సభర్వాల్, సినీ దర్శకుడు రాజమౌళిలపై చర్యలు తీసుకోవాలంటూ శాంతి దివ్యాంగుల సంఘం అధ్యక్షురాలు రజనీ ఛత్రినాక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ






శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం, దాతల సహకారంతో అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# వాహన రిజిస్ట్రేషన్ కార్డుల్లేవ్..!

ఖమ్మం : ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో వాహన రిజిస్ట్రేషన్ కార్డు (ఆర్సీ)ల కొరత వేధిస్తోంది. మే 1 నుంచి ఆర్సీ కార్డులకు సంబంధించిన ప్రింటింగ్, పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. నూతన వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టేషనరీ కొరత కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రెండు నెలల క్రితమే జిల్లా ఆర్టీఏ కార్యాలయాలకు వాహన రిజిస్ట్రేషన్ కార్డుల సరఫరా నిలిచిపోయింది. ఈనేపథ్యంలో ఆర్టీఏ కార్యాలయాల్లో కార్డుల పంపిణీ జరగటం లేదు. రవాణా శాఖ అధికారులను అడిగితే కార్డుల కొరత ఉందని, పోస్టులో వస్తుందని చెబుతున్నారని వాహనదారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. వాహన తనిఖీల్లో ట్రాఫిక్, రవాణా శాఖ అధికారులకు పట్టుబడితే ఏం సమాధానం చెప్పాలో పాలుపోని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.




మే 1 నుంచి ఆగిన ప్రింటింగ్ ఖమ్మం ఆర్టీఏ కార్యాలయంలో రోజుకు సుమారు 60 నుంచి 70 నూతన వాహనాల రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. వీటిలో ద్విచక్రవాహనాలు, కార్లు, ట్రాక్టర్లు, లారీలు వంటివి ఎక్కువగా ఉంటాయి. సంబంధిత ధ్రువపత్రాలతో వాహన రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత సాయంత్రం అప్రూవల్ చేసి ఆర్సీ కార్డును ప్రింటింగ్ చేస్తారు. ఆ తర్వాత కార్డులను పోస్టల్ ద్వారా వాహనదారులకు అందజేస్తారు. ఏప్రిల్‌లో రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయం నుంచి తీసుకొచ్చిన స్టేషనరీలో ఆర్సీ కార్డులను సరిపడా ప్రింటింగ్ చేసి వాహనదారులకు అందించారు. స్టేషనరీని పూర్తిగా వినియోగించటంతో మే 1 నుంచి రిజిస్ట్రేషన్ కార్డుల ప్రింటింగ్ జరగటం లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2వేలకు పైగా దరఖాస్తుల కార్డుల ప్రింటింగ్, పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. ఖమ్మంతో పాటు వైరా, సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయాల్లో ఆర్సీ కార్డుల కొరత వేధిస్తోంది. డ్రైవింగ్ లైసెన్సు కార్డులు సైతం తక్కువగా ఉన్నట్లు సమాచారం.

కొద్దిరోజులుగా ఆర్సీ కార్డుల ప్రింటింగ్ నిలిచిపోయిన మాట వాస్తవమే. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్సీ కార్డుల కొరత వేధిస్తోంది. కార్డుల అంశంపై రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయం నుంచి ఎలాంటి సమాచారం లేదు. పైనుంచి కార్డులు వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న వాహనదారులకు మూడు, నాలుగు రోజుల్లో పంపిణీ చేస్తాం. అఫ్రిన్ సిద్దిఖీ, జిల్లా రవాణాశాఖ అధికారి

# కడ'గండ్లు మిగిలాయ్'..

అశ్వారావుపేట : భారీ వర్షాలకు అశ్వారావుపేట మండలం చిగురుటాకులా వణికింది. పెద్దవాగు ప్రాజెక్టుకు గండ్లు పడటంతో ముంపు ప్రాంతాల వాసులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జాగారం చేశారు. ఓవైపు చిమ్మచీకట్లు, మరోవైపు జలప్రళయంతో ఎవరిని కదిపినా తొలుత కన్నీళ్లే సమాధానమిస్తున్నాయి.

**ఆనవాళ్లు కోల్పోయిన పెద్దవాగు ప్రాజెక్టు**

ఇన్నాళ్లూ వరప్రదాయినిగా పేరుగాంచిన పెద్దవాగు ప్రాజెక్టు.. ఇప్పుడు అన్నదాతలకు తీరని శోకం మిగిల్చింది. ప్రాజెక్టుకు ఉన్న మూడు గేట్లలో రెండింటిని ఎత్తి నీటిని విడుదల చేయగా మరో గేటు ఎత్తే క్రమంలో మొరాయించింది. ఎగువ ప్రాంతంలో నారాయణపురం–బచ్చువారిగూడెం మధ్య సుమారు మూడు కిలోమీటర్ల మేర నిలిచిన వరదనీరు నదిని తలపించింది. పైనుంచి వరద నీరు చేరటంతో ఒత్తిడి పెరిగి పెద్దవాగు ప్రాజెక్టు కట్టకు గండ్లు పడ్డాయి. ప్రాజెక్టు దిగువ భాగం.. రాళ్ల గుట్టను తలపిస్తోంది. కట్ట నుంచి కుడికాల్వ పునాది వరకు ఆనవాళ్లు కనిపించకుండా పోయింది. ఈప్రాంతం ప్రమాదకరంగా మారటంతో కట్టపైకి ఎవరూ వెళ్లకుండా పోలీసులు ముళ్ల కంచె వేశారు. గుమ్మడవల్లి నుంచి ప్రాజెక్టుకు వెళ్లే మార్గం ఛిద్రమైంది. వేలేరుపాడు మార్గంలో నారాయణపురం– బచ్చువారిగూడెం మధ్య రెండు కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్డు కొట్టుకుపోయింది. సుమారు 25 చోట్ల ప్రాజెక్టుకు గండ్లు పడటంతో ఆయకట్టు భూముల్లో ఇసుక మేటలు, రాళ్ల కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ భూములను మళ్లీ సాగుచేయాలంటే ఎకరాకు కనీసం రూ.50 వేల నుంచి రూ.లక్ష ఖర్చవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అశ్వారావుపేట వెంకమ్మ చెరువు ప్రధాన కాల్వకు అయిదు చోట్ల భారీ గండ్లు పడ్డాయి. సుమారు 150 ఎకరాల్లో వేసిన వరి నాట్లు కొట్టుకుపోయాయి.



**నష్టం అంచనా రూ.190 కోట్లు!**

పెద్దవాగు ప్రాజెక్టు వద్ద గండ్ల పూడ్చివేత, రింగ్ బండ్, కుడికాల్వ తూముల పునరుద్ధరణ, క్రస్ట్‌గేట్ల మరమ్మతులు తదితరాలకు సుమారు రూ.150కోట్లు ఖర్చవుతాయని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. నారాయణపురం– గాండ్లగూడెం, కావడిగుండ్ల– గోపన్నగూడెం నడుమ వంతెనలు దెబ్బతిన్నాయి. రోడ్డు రక్షణకు ఏర్పాటు చేసిన గోడ కొట్టుకుపోయింది.నారాయణపురం–బచ్చువారిగూడెం, గాండ్లగూడెం– నారాయణపురం, మల్లాయిగూడెం– దబ్బతోగు, గోపన్నగూడెం– కన్నాయిగూడెం, కొత్తకన్నాయిగూడెం– గోగులపూడి మధ్య రహదారులు ఛిద్రమయ్యాయి. మొత్తమ్మీద ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.35కోట్లకు పైగా నష్టం సంభవించిందని సమాచారం. ఐటీడీఏ రహదారుల మరమ్మతులకు సుమారు రూ.15లక్షలు వెచ్చించాల్సి వస్తుందని తెలుస్తోంది. సుమారు 350 విద్యుత్తు స్తంభాలు విరిగిపడ్డాయి. పది నియంత్రికలు నేలమట్టమయ్యాయి. విద్యుత్తు సంస్థకు సుమారు రూ.4కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు భావిస్తున్నారు.

**21న కేంద్ర బృందం రాక**

పెద్దవాగు ప్రాజెక్టును పరిశీలించేందుకు జాతీయ ప్రాజెక్టుల భద్రత అధికారుల బృందం గుమ్మడవల్లికి ఆదివారం రానున్నట్లు సమాచారం. పెద్దవాగు కింద కట్ట సమీపంలో ఏర్పాటుచేసిన దొడ్డిలో మేకలు, గొర్రెలు ఉంచాను. రాత్రిపూట అకస్మాత్తుగా వరద వచ్చి దొడ్డిపై పడటంతో పది గొర్రెలు, పది మేకలు మృతిచెందాయి. మరో పది జీవాలు వరదల్లో కొట్టుకుపోయాయి. ఒడ్డుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కొన్ని మాత్రమే ఒడ్డుకు చేరాయి. రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. మా గ్రామంలో పది మంది రైతుల పశువులు, గొర్రెలు, మేకలు కొట్టుకుపోయాయి. సాధనం రామకృష్ణ, కోయరంగాపురంమాకు ఉన్నదే రెండెకరాలు. వరి సాగుచేశాం. వరదకు పొలమంతా ఇసుక మేటలు వేశాయి. ఇసుకను తొలగించాలంటే రూ.లక్షల్లో ఖర్చవుతుంది. ఏమి చేయాలో పాలుపోవటం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.సాయిల అన్నపూర్ణ, గుమ్మడవల్లి

# సౌరశక్తితో ఆదాయం

భువనగిరి : కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత సౌర విద్యుత్తు అందించడమే లక్ష్యంగా 'ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ' పథకానికి శ్రీకారం చుట్టింది. సామాన్య పౌరుడిపై విద్యుత్తు భారం, వాతావరణ కాలుష్యం తగ్గించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించింది. ఇందుకోసం పెద్ద ఎత్తున రాయితీ సైతం కల్పిస్తోంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్ల కాలపరిమితితో విద్యుత్తు ఛార్జీల నుంచి ఉపశమనం పొందవచ్చు. వినియోగానికి మించి విద్యుత్తు ఉత్పత్తి జరిగితే నెట్ మీటరింగ్ విధానంలో విద్యుత్తు శాఖ ఒక్కో యూనిట్‌కు రూ.4.17 చెల్లించి కొనుగోలు చేస్తుందని, ఆదాయం పెంపొందించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

**రాయితీ ఇలా..**యూనిట్‌కు అయ్యే ఖర్చు లబ్ధిదారులే చెల్లించాలి. దీని కింద అందించే రాయితీ నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని, బ్యాంకుల నుంచి భారీ రాయితీలు, రుణాలు పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. ఉదాహరణకు కిలోవాట్ (నెలకు 120



యూనిట్ల వినియోగం) విద్యుత్తు పొందాలనుకునే వినియోగదారులు రూ.55 వేలు చెల్లిస్తే రూ.30 వేల రాయితీ, 2 కిలోవాట్లకు రూ.లక్ష చెల్లిస్తే రూ.60 వేల రాయితీ, 3 కిలోవాట్లకు రూ.1.40లక్షలకు గానూ రూ.78 వేల రాయితీ అందుతాయి.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఇలా..**ఈ పథకం కోసం ఆన్‌లైన్‌లో %http:///// www.pmsuryaghar.gov.i n% లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ–మెయిల్ ఐడీ, విద్యుత్తు కనెక్షన్, చరవాణి నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయాలి. సర్వీస్ నెంబరు, మొబైల్ నంబరుతో లాగిన్ అయి రూఫ్‌టాప్ సోలార్‌ప్లాంటు కోసం దరఖాస్తు చేసుకోవాలి. గతంలో ఉపయోగించిన విద్యుత్తు వివరాలు నమోదు చేయాలి. విద్యుత్తు శాఖ అధికారులు వినియోగదారుడి చిరునామాకు వచ్చి అన్ని వివరాలు పరిశీలిస్తారు. అనంతరం గుత్తేదారుకు ఈ వివరాలు అందిస్తారు. నిర్ణీత రుసుం చెల్లిస్తే గుత్తేదారు సౌర పలకలు, ప్యానల్ బోర్డులు బిగిస్తారు. విద్యుత్తు కార్యాలయంలో దరఖాస్తు చేసిన తర్వాత నెట్ మీటరింగ్ బిగిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తదనంతరం రాయితీ సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు.

# శాతవాహనలో అక్రమాల నిగ్గు తేల్చండి



కరీంనగర్ : శాతవాహన విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే వేదిక. అందులో చదువుకున్న వారు వివిధ హోదాల్లో ఉన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా వర్సిటీలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పలు సందర్భాల్లో ఆరోపించారు. అందులో ఏం జరిగినా బయటకు తెలియనివ్వకుండా జాగ్రత్త పడుతున్నారని తెలిపారు. చివరకు వారు కొంతకాలంగా తెలంగాణ స్టేట్ విజిలెన్స్ కమిషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఫిర్యాదు చేస్తూ వస్తున్నారు. వారు చేస్తున్న ఆరోపణలు ఎంతవరకు నిజమో తెలుసుకోవడానికి ప్రభుత్వం విజిలెన్స్ అధికారులను విచారణకు ఆదేశించింది. సంబంధిత అధికారులు త్వరలో విచారణ చేయనున్నారు.

సామాజిక కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ఫిర్యాదు అంశాలు ఇలా..

ఎస్‌యూలో కొందరు ఉన్నతాధికారులు అక్రమార్జనే ధ్యేయంగా పాలన కొనసాగించారు. పాలకుల పైరవీలు, సిఫార్సులతో యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేపట్టారు. కనీస అర్హత లేకపోయినా నచ్చిన వారిని ప్రొఫెసర్లుగా, అసోసియేట్ ప్రొఫెసర్లుగా నియమించారు.

నకిలీ ఐడీ కార్డు వేసుకొని ఓ వ్యక్తి యూనివర్శిటీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని వసూళ్లకు తెగబడ్డారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా మిన్నకుండిపోయారు.

రెగ్యులర్ కోర్సులుగా నడుస్తున్న నాలుగు డిపార్ట్‌మెంట్లను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా చూపి యూజీసీ–12బి గుర్తింపు కోసం తప్పుడు నివేదికను సమర్పించి, జాతీయ సంస్థను మోసం చేశారు.

విశ్వవిద్యాలయ వాహనాల కొనుగోలు, యాక్సిడెంట్ల ఖర్చుల మీద, చలాన్ల పేరుతో లక్షలాది రూపాయాలు దుర్వినియోగం చేశారు.

అర్హత లేని విశ్రాంత అసిస్టెంట్ ట్రెజరీ అధికారిని డిప్యూటీ ట్రెజరీ అధికారిగా పత్రాల్లో చూపి శాతవాహన ఫైనాన్స్ అధికారిగా కొనసాగించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఎస్‌యూలో లేకపోయినా గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధి బంధువు, విశ్రాంత ఆచార్యుడిని నియమించారు.

పరిపాలన భవనం మొదటి అంతస్తు నిర్మాణంలో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించక విశ్వవిద్యాలయం నిధులు కోట్లల్లో కొల్లగొట్టారు. పరీక్ష పేపర్ లీకేజీలు, టెండర్ లేకుండానే పరీక్ష జవాబు పత్రాల స్కానింగ్ ప్రక్రియపై ఓ సంస్థకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టి, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు.

పరీక్షల విభాగంలో ఓ అధికారి 2015 నుంచి తిష్ఠ వేయగా అతనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యతల నుంచి తొలగించాలి.

గత ఉపకులపతి రెసిడెన్స్ నిర్వహణ, హాస్పిటాలిటీ, ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా చేశారు.

బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలపై తీసుకొచ్చిన కొత్త జీవో 1222లో అవకతవకలు జరిగాయి.

బోధనేతర సిబ్బందికి పీఎఫ్ డబ్బులను ఖాతాలో జమ చేయకుండా ఫైనాన్స్ అధికారి, రిజిస్ట్రార్ వద్దనే అంటిపెట్టుకున్నారు. బోధనేతర సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల టెండర్లపై సమగ్ర విచారణ చేయాలి.

గత 2021–22, 2022–23 సంవత్సరంలో జరిగిన ఆడిట్ నివేదికలపై సమగ్ర విచారణ చేపట్టాలి.

ఇతర శాఖలతో కలిసి ముందుకు..

శాతవాహన విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలనే ఉత్తర్వులు గురువారం జిల్లా కార్యాలయానికి అందాయి. ఆరోపణలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఇతర శాఖల అధికారుల సహకారం తీసుకొని విచారణ కొనసాగిస్తాం. ఎస్‌యూలో జరిగిన అవకతవకలపై ఎవరి వద్ద ఎలాంటి సమాచారమున్నా మమ్మల్ని సంప్రదించవచ్చు. విచారణ పారదర్శకంగా జరిపి హైదరాబాద్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.అనిల్‌కుమార్, విచారణ అధికారి,విజిలెన్స్ విభాగం, కరీంనగర్

# పరిసరాల పరిశుభ్రత పాఠాలకే పరిమితం!



సత్తుపల్లి : సత్తుపల్లి పాత సెంటర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 212 మంది విద్యార్థులు, మరో తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో స్కావెంజర్ లేకపోవడం, మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణ శుభ్రం చేయటానికి మున్సిపల్ కార్మికులు రాకపోవడంతో ఉపాధ్యాయులే తలాకొంత వేసుకుని ఓ కార్మికురాలితో పనులు చేయించుకుంటున్నారు.

పెనుబల్లి మండలం వీఎం బంజర హైస్కూల్లో స్కావెంజర్ లేరు. పంచాయతీ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలి. కానీ పంచాయతీ కార్మికులు రావటం లేదు. దాదాపు 380 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు. స్కావెంజర్ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

సర్కారు బడుల్లో ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోంది. ప్రైవేటుకు దీటుగా డిజిటల్ తరగతులు, పౌష్టికాహారం, ఏకరూప దుస్తులు, అభ్యసన సామగ్రి అందిస్తోంది. మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నాయి. అంతవరకు బాగానే ఉన్నా పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించకపోవడంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. ఆవరణ అధ్వానంగా మారుతుండగా శౌచాలయాలు కంపు కొడుతున్నాయి. పరిసరాల పరిశుభ్రత పాఠాల వరకే పరిమితమవుతోంది.

**కొవిడ్ తర్వాత స్కావెంజర్ల రద్దు**

కొవిడ్‌కు ముందు అన్ని పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించగా ఆవరణ, తరగతి గదులను శుభ్రం చేస్తూ మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేవారు. కొవిడ్ కాలం తర్వాత స్కావెంజర్ల వ్యవస్థను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బందితో పాఠశాలలను శుభ్రపరచుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఎక్కడా స్కావెంజర్లను నియమించలేదు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడం, ఉన్నచోట తరగతుల ప్రారంభమైన తర్వాత వస్తుండడంతో పెద్దగా ప్రయోజనం నెరవేరటం లేదు. ఎక్కువ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించింది.

**అపరిశుభ్ర వాతావరణంతో గగ్గోలు**

అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఊడ్చేందుకు, మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది లేకపోవడంతో ఆవరణల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పెరిగిపోయింది. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు. అసలే వర్షాకాలం.. ముమ్ముందు ఇదే తంతు కొనసాగితే చాలామంది విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదముంది.

మండల స్థాయిలో ఎంపీడీఓలు పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులతో, పట్టణ స్థాయిలో పురపాలిక పారిశుద్ధ్య సిబ్బందితో ప్రభుత్వ పాఠశాలల్లో పనులు చేయించుకోవాలి. వారితోనే పాఠశాలల్లో పరిసరాలు, మరుగుదొడ్లను శుభ్రపర్చుకోవాలని ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్కావెంజర్లను ఏర్పాటుచేసుకోవాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. వెంకటేశ్వరచారి, డీఈఓ, భద్రాద్రి కొత్తగూడెం

# రుణమాఫీ సమస్యలకు పరిష్కార విభాగం

ఖమ్మం : పంట రుణమాఫీపై రైతుల సందేహాలు, ఇబ్బందులు పరిష్కరించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా 'పరిష్కార విభాగాన్ని' ఏర్పాటు చేసినట్లు డీఏఓ విజయనిర్మల తెలిపారు. రైతులు తమ సమస్యలను టోల్‌ఫ్రీ నం.1950 లేదా 90632 11298ను సంప్రదించాలని సూచించారు. మండల స్థాయిలో ఏఓలు, క్లస్టర్ పరిధిలోని ఏఈఓల ద్వారా కూడా తెలియజేయాలని కోరారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన పరిష్కార విభాగానికి సంబంధించి పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

బదిలీలకు తాత్కాలిక బ్రేక్?

రైతు రుణమాఫీ నేపథ్యంలో వ్యవసాయశాఖలో బదిలీలకు తాత్కాలిక బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. మరోపక్క బదిలీల ప్రక్రియ పూర్తిచేసేందుకు ఈ నెల 20 వరకు గడువుంది. ఇప్పటివరకు చేపట్టకపోవటంతో వాయిదాపడే అవకాశం ఉందని ఉద్యోగులు భావిస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అయిదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న అధికారులు, ఉద్యోగులు సుమారు 90శాతం ఉన్నారు. వానాకాలంలో రైతులకు ఎరువులందేలా చర్యలు తీసుకోవాలి. కీలక సమయంలో బదిలీలతో ఇబ్బందులుంటాయనే ఉద్దేశంతో తాత్కాలిక విరామమివ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

# జీవనశైలి మార్పు..

# దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు

భువనగిరి : జీవనశైలి మారడంతో మూడు పదుల వయస్సు వారు సైతం మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్నారు. వ్యాధిగ్రస్థులను గుర్తించి ఔషధాలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ (సంక్రమించని వ్యాధులు) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా ఎన్‌సీడీ ద్వారా పరీక్షలు చేస్తూ దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు(బీపీ), మధుమేహం గుర్తిస్తోంది. నోటి క్యాన్సర్, గైనిక్ సంబంధించి క్యాన్సర్ల అనుమానిత లక్షణాలున్నవారికి నిర్ధారణకు జిల్లా కేంద్రాసుపత్రి, హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారు. బీపీ, షుగర్‌తో బాధపడేవారికి ఔషధాలు అందజేస్తూ జబ్బు తీవ్రం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

**రక్తపోటు, మధుమేహం బాధితులే ఎక్కువ**

రక్తపోటు బారిన పడుతున్న వారి సంఖ్య వేగంగా పెరుగుతుందని పలు సర్వేలతో పాటు, ఆరోగ్య సంస్థలు హెచ్చరిస్తుండగా జిల్లాలో



కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పరీక్షల్లో 50 వేల మందికి పైగా రక్తపోటుతో బాధపడుతున్న నిర్ధారణ అయ్యింది. 25 వేల మందికిపైగా మధుమేహ బాధితులు ఉన్నట్లు తేలింది. బీపీకి సంబంధించి నాలుగు రకాల మాత్రలు, షుగర్‌కు సంబంధించి మూడు రకాల మాత్రలు అందుబాటులో ఉన్నాయి. వ్యక్తుల వ్యాధి తీవ్రతను బట్టి పీహెచ్‌సీ వైద్యుడు మాత్రలు ఇస్తున్నారు. క్యాన్సర్ అనుమాన లక్షణాలు గుర్తించినట్లయితే స్క్రీనింగ్ కోసం జిల్లా కేంద్రాసుపత్రులకు పంపిస్తున్నారు.

**పెరుగుతున్న వ్యాధి బాధితులు**

జిల్లాలో ఇప్పటి వరకు 3,87,852 మందికి పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులు బయటపడ్డ వారి వివరాలు వెబ్‌పోర్టల్ నమోదు చేస్తూ ఎన్‌సీడీ కార్డు అందజేస్తున్నారు. ఆ కార్డులో రోగి పేరు, వ్యాధికి ఇస్తున్న ఔషధాల వివరాలు పొందుపరుస్తున్నారు. పీహెచ్‌సీల పరిధిలో ఆశా, ఏఎన్‌ఎమ్‌ల ద్వారా నెలనెలా ఔషధాలు అందజేస్తున్నారు. జిల్లా కేంద్రాసుపత్రిలో ఎన్‌సీడీ శిబిరం ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది.

దీర్ఘకాలిక జబ్బులు తీవ్రం కాకుండా గుర్తిస్తున్నాం

సుమన్ కళ్యాణ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్

ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని గుర్తిస్తున్నాం. నెలనెలా పరీక్షలు చేస్తూ ఔషధాలు అందజేస్తున్నాం. దీర్ఘకాలిక రోగాలు తీవ్రం కాకుండా అన్నీ పీహెచ్‌సీల పరిధిలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ద్వారా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి కావాల్సిన చికిత్సలు సైతం అందజేస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధులు నిర్ధారణ అయినవారు వైద్యుల సూచనలు లేకుండా ఔషధాలు ఆపివేయొద్దు.

# నల్లమట్టి కొల్లగొట్టె..!

మిర్యాలగూడ :గుర్రంపోడు మండలంలోని చేపూరు, మొసంగి పాల్వాయి చెరువుల నుంచి మట్టిని తరలిస్తున్నట్లు చాలాకాలంగా ఆరోపణలు వస్తున్నాయి. చెరువుల్లోని సారవంతమైన నల్లమట్టిని పొలాలకు తరలించి నాణ్యమైన దిగుబడిని సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి గండిపడుతోంది. గతంలో మిషన్ కాకతీయ పేరిట ఆయా గ్రామాల్లో చెరువు మట్టిని రైతులు తమ పంట పొలాల్లో పోసుకోవడానికి అవకాశం ఉండేది. అయితే కొంతమంది చెరువుల్లో నల్లమట్టి పూడికతీత పేరిట అనుమతులు తీసుకుని డంపింగ్ చేసి ఇటుక బట్టీలకు వేలాది రూపాయలకు అమ్ముకుంటున్నారు. ఈ దందాకు అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఈ దందా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. కట్టుదిట్టమైన చర్యలు జాకబ్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, మైనింగ్‌శాఖఅక్రమాలను నియంత్రించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు వేసిన కమిటీలో కలెక్టర్, ఆర్డీవో, పుర కమిషనర్, ఇతర జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి కమిటీలో ఎంపీడీవో, తహసీల్దారు, సీఐ, ఎస్సై, ఏఈ తదితర మండల స్థాయి అధికారులకు పర్యవేక్షణ అధికారాలున్నాయి. మట్టిని అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే టన్ను మట్టికి రూ.440 జరిమానాతో పాటు వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేసి కోర్టుకు పంపుతాం.

అనుమతులు ఇలా..చెరువుల నుంచి ఇటుకల బట్టీలకు తరలించడానికి టన్ను మట్టికి రూ.43 చొప్పున చెల్లించాల్సి ఉంది. ఇందుకు వినియోగించే జేసీబీకి, టిప్పర్‌కు ముందస్తుగా అనుమతి పత్రాలు మైనింగ్‌శాఖ నుంచి పొందాల్సి ఉంటుంది. అధికారుల అంచనా ప్రకారం ఒక టిప్పర్‌లో సుమారు 15 నుంచి 20 టన్నుల చెరువు మట్టి తరలించవచ్చు. సెలవు దినాలలో సాయంత్రం ఆరు గంటల తర్వాత మట్టి రవాణాకు అనుమతి లేదు.

38 చెరువులకే..పూడికతీసి మట్టిని తరలించడానికి జిల్లాలో 38 చెరువులకు అనుమతులు ఇచ్చినట్లు మైనింగ్ అధికారులు తెలిపారు. నిడమనూరు, గుర్రంపోడు, దేవరకొండ, మిర్యాలగూడ, మాడ్గులపల్లి, వేములపల్లి, దామరచర్ల, కనగల్, చింతపల్లి, నాంపల్లి మండలాల్లో చెరువుల నుంచి మట్టి తరలింపునకు అనుమతులు తీసుకున్నారు. వీరికి ఇటుక బట్టీలకు తరలించడానికి నిబంధనలతో కూడిన అనుమతి జిల్లా మైనింగ్ శాఖ ఇస్తుంది.

# వైద్యారోగ్యం.. పర్యాటకం

హైదరాబాద్: అంతర్జాతీయ వైద్య ప్రమాణాలు, పర్యాటక ప్రాంతాల విశిష్టతలు ఒకే ప్రాంతంలో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో హెల్త్ టూరిజం హబ్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ, ఐటీ, పరిశ్రమలు, వైద్యారోగ్యశాఖల అధికారులు హెల్త్‌టూరిజం హబ్‌ను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి 20 కిలోమీటర్ల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను సేకరిస్తున్నారు. ఒకేచోట 500 నుంచి 1000 ఎకరాల భూములుంటే బాగుంటుందన్న ఆలోచనతో అధికారులున్నారు. షాబాద్.. శంషాబాద్.. మహేశ్వరం.. హెల్త్ టూరిజం హబ్ కోసం షాబాద్, శంషాబాద్, మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని ప్రభుత్వ భూములను అధికారులు పరిశీలిస్తున్నారు. షాబాద్ మండలంలో చందనవెల్లిలో ఇప్పటికే ఐటీ, పరిశ్రమలుండటం, శంషాబాద్‌లో బహుళ అంతస్థుల భవనాలు, పట్టణ అటవీ పార్కులు, ఎకోటూరిజం పార్కు ఉండటం, మహేశ్వరంలోని తుక్కుగూడ సమీపంలో ఐటీ పరిశ్రమలు ఇప్పుడిప్పుడే వస్తుండటం, కందుకూరు మండలంలో ఫార్మాసిటీ కోసం భూములు సేకరించడం వంటి అంశాలను ఐటీ, పరిశ్రమల అధికారులు పరిశీలిస్తున్నారు.

# కురుస్తున్న వర్షాలు.. పెరుగుతున్న సాగు

జగిత్యాల : ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి జిల్లాలో పంటల సాగువిస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. కరీంనగర్ జిల్లాలో అధిక వర్షపాతం, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా కరీంనగర్ జిల్లాలో పైర్లసాగు 19.84 శాతానికి, పెద్దపల్లి 29.27, జగిత్యాల 20.27, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 28.67 శాతానికి చేరింది. అల్పపీడనం, ఉపరితల ఆవర్తనద్రోణి ప్రభావంతో ఇంకా వర్షసూచన ఉండటంతో పంటలసాగు విస్తీర్ణం సాధారణ స్థితికి చేరుకునే అవకాశముంది. ఎల్లంపల్లి, ఎస్సారెస్పీలోకి వరదనీరు వచ్చిచేరుతుండటం ఆశాజనకంగా మారింది. ప్రస్తుతం భూగర్భ జలాల ఆధారంగా పంటలను సాగుచేస్తుండగా వర్షాలు మరింతగా పెరిగితే ఆయకట్టు రైతులకు భరోసా కలుగుతుంది.

**సన్నరకం వరికి ప్రాధాన్యం**

ఈ యాసంగిలో 8.45 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తారని అంచనా. ప్రస్తుతం వర్షాలను ఆసరాగా చేసుకుని పెద్దఎత్తున వరినాట్లు వేస్తున్నారు. నిరుటితో పోలిస్తే దొడ్డుగింజ వరి రకాల సాగు ఈ వానాకాలంలో తగ్గనుంది. రాష్ట్రప్రభుత్వం క్వింటాలుకు రూ.500



బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తామనటంతో సన్నగింజ వరిరకాల సాగు గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం స్వల్పకాలిక రకాలతో వరి నార్లకు ఈ నెలాఖరు వరకు, అతిస్వల్పకాలిక రకాలతో ఆగస్టు మొదటివారం వరకు, వరినాట్లకు ఆగస్టు నెలాఖరు వరకు సమయం ఉంది. వర్షాలు అనుకూలిస్తే వరిసాగు గత ఏదాది మాదిరిగా 9.65 లక్షల ఎకరాలకు చేరుకునే అవకాశముంది. ఇప్పటివరకు 1.55 లక్షల ఎకరాల్లో పత్తిని విత్తుకోగా ఈ నెలాఖరు వరకు 1.90 లక్షల ఎకరాలకు సాగు పెరగనుంది. పలు రకాల పంటల సాగుకు మరో పక్షం రోజుల వరకు అవకాశం ఉండటంతో పసుపుపంట 35 వేల ఎకరాలు, మక్క 55 వేలు, కంది 11 వేల ఎకరాల్లో సాగులోకి రానుంది. దాదాపుగా 30 వేల ఎకరాలకు పైబడిన విస్తీర్ణంలో అయిల్‌పామ్ మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పంటలసాగు క్రమంగా పెరుగుతున్న తరుణంలో రైతులందరికీ పంటరుణ మాఫీ నిధుల విడుదల, నూతన పంటరుణాల మంజూరు, పెట్టుబడి సాయం, వ్యవసాయ యాంత్రీకరణకు నిధుల విడుదల, రైతుబీమా పథకం కొనసాగింపు, రసాయన ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకున్నట్లయితే వానాకాలం పంటలసాగులో రైతులకు మరింత మేలు చేకూరనుంది.

## నీరు నిలిస్తే.. పంట చేలకు చేటే..

భద్రాద్రి : జిల్లాల్లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలుస్తోంది. ఇలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో వర్షాధార పంటలైన మొక్కజొన్న, కంది, పత్తి, జొన్న, పెసర, మినుముతో పాటు వరి, మిరప, ఉద్యాన పంటలు పండిస్తున్న రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వర్షం నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉ ఒడటం వల్ల మొక్కల వేర్లకు గాలి, సూర్యరశ్మి అందక ఎర్రబారి చనిపోతాయని.. చీడపీడలు, తెగుళ్లు బారిన పడే అవకాశముంటుందని చెబుతున్నారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం సమాచారం ప్రకారం.. ఉభయ జిల్లాల్లో రానున్న అయిదు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈనేపథ్యంలో పత్తి, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర పొలాలతో పాటు వరి, మిరప నారుమళ్లలో వర్షం నీరు నిలవకుండా మురుగుకాల్వలు ఏర్పాటుచేసుకోవాలని వ్యవసాయా ధికారులు సూచిస్తున్నారు.

**ఇవిగో జాగ్రత్తలు**

భారీ వర్షాలు కురిసే సమయంలో పంట పొలాల్లో ఎరువులు, కలుపు నివారణ మందులు వేసుకోకూడదు.

అధిక తేమ ప్రభావం వల్ల మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించే అవకాశముంది. దీని నివారణకు 0.4 మి.లీ. క్లోరాంట్రనిలిప్రోల్ లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ మొక్కల సుడిలో పిచికారి చేయాలి.గాలిలో అధిక తేమ వల్ల ఇప్పటికే విత్తుకున్న పత్తి పంటకు రసం పీల్చే పురుగులు ఆశించే ఆస్కారముంది. వీటిని గుర్తించినట్లయితే నివారణకు 2మి.లీ ఫ్రిపోనిల్ లేదా 0.2 గ్రా. అసిటామిప్రిడ్ లేదా



0.25 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటిలో కలిపి చల్లుకోవాలి.వరి నాట్లు వేసుకున్నట్లయితే పంట పొలాల్లో నిలిచిన వర్షం నీటిని కాల్వల ద్వారా బయటకు పంపించాలి. నీటిలో మునిగి ఉంటే గాలి, సూర్యరశ్మి అందక పంట ఎర్రబారి చనిపోయే ప్రమాదముంది.మిరప.. నారు దశలో ఉంటే నారుమళ్లలో నీరు నిలవకుండా చూడాలి. నీరు నిల్వ ఉంటే మొక్కలకు ఎండు, నారుకుళ్లు తెగులు సోకవచ్చు. మిరప తెగులు నివారణకు లీటరు నీటికి మెటలాక్సిల్ 2 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. కలిపి తెగులు సోకిన మొక్క మొదళ్ల చుట్టూ పిచికారి చేయాలి.భారీ వర్షాల సమయంలో పిడుగులు పడే ఆస్కారముంది. పశువులను బయటకు పంపకుండా పాకలోనే కట్టేసి మేతనందించాలి.భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వీలైనంత వరకు పంట పొలాల్లో వర్షం నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అధిక తేమ వల్ల పంటలకు తెగుళ్లు సోకే అవకాశముంటుంది. సస్యరక్షణ చర్యలు పాటించాలి. ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు తెలుసుకుంటూ ముందుకు సాగాలి. శ్రీనివాసరావు, కేవీకే శాస్త్రవేత్త, కొత్తగూడెం

# ఎరువులు పుష్కలం.. అన్నదాతకు అభయం



తాండూరు: జిల్లాలో వానాకాలం పంటల సాగు అవసరాల రీత్యా ప్రభుత్వం సరిపోను ఎరువులను నిల్వ చేస్తోంది. నిర్ణీత గోదాముల నుంచి డిమాండ్ మేరకు ఎరువుల బస్తాలను దుకాణదారులకు సరఫరా చేస్తోంది. రైతులు అందుబాటులో ఉన్న దుకాణాలకు వచ్చి కావాల్సిన ఎరువుల బస్తాలను కొనుగోలు చేస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

**సనత్‌నగర్, తిమ్మాపూరు నుంచి సరఫరా**

ఇతర దేశాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, విశాఖ పోర్టులకు ఎరువులు దిగుమతి అవుతున్నాయి. అక్కడి నుంచి గూడ్సు రైళ్ల ద్వారా హైదరాబాద్ సనత్‌నగర్, రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్ గోదాములకు చేరుకుంటున్నాయి. ఇక్కడి నుంచి జిల్లాలోని ఆయా విక్రయ కేంద్రాలకు మార్క్‌ఫెడ్ అధికారులు, ప్రైవేటు డీలర్లు వ్యవసాయ శాఖ సూచించిన మేరకు డిమాండ్‌ను బట్టి సరఫరా చేస్తున్నారు. దీంతో రైతులకు ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూస్తున్నారు.

జిల్లాలోని 28 ఆగ్రోస్, 19 సహకార సంఘాలు, 3 డీసీఎమ్మెస్‌లు, 6ఎఫ్‌పీవోలు, 18 డీసీఎమ్మెస్‌లకు ఉన్న అనుబంధ సంస్థలతో పాటు 346 దుకాణాలకు మార్క్‌ఫెడ్ ద్వారా వ్యవసాయ శాఖ ఎరువులను సరఫరా చేస్తోందని జిల్లా మార్క్‌ఫెడ్ అధికారిణి తహసీమ తెలిపారు. గోదాములకు వచ్చిపోతున్న ఎరువులను ఎప్పటికప్పుడు గణిస్తున్నట్లు పేర్కొన్నారు.

వాడిన ఎరువులు (మె.టన్నులు)

యూరియా ..: 9,232

డీఏపీ..: 9,893

కాంప్లెక్స్..: 7,989

ఎంవోపీ..: 188

ఎస్ఎస్‌పీ..: 95

**వినియోగించినవి 27,397 మెట్రిక్ టన్నులు**

వానాకాలం సాగు కింద జిల్లాలో ఇప్పటి వరకు కంది, పత్తి, మినుము, పెసర, వరి, జొన్న, చిరుధాన్యాలు, మక్కలు, పత్తి తదితర పంటలను సాగు చేశారు. వీటి ఎదుగుదల, ఆశాజనకమైన దిగుబడులకు సంబంధించి 27,397 మెట్రిక్ టన్నుల ఎరువును వినియోగించారు. ఇంకా పంటల అవసరాల కోసం యూరియా 13,604, డీఏపీ 2,100, కాంప్లెక్స్ 4,786, ఎంవోపీ 292, ఎస్ఎస్‌పీ 175 మెట్రిక్ టన్నుల చొప్పున నిల్వలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖలో ఎరువుల వ్యవహారాలు చూస్తున్న టెక్నికల్ వ్యవసాయ అధికారి స్నేహ లక్ష్మి తెలిపారు. ఎరువుల కొరత లేకున్నా ఇదే అదనుగా కొందరు వ్యాపారులు కల్తీలకు పాల్పడే అవకాశం లేకపోలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ ఆరంభంలో నాసిరకం పత్తి, కంది తదితర విత్తనాలు అమ్మడం, వాటిని అధికారులు పట్టుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇప్పుడు ఎరువు విషయంలో కూడా అలాంటివి చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు. కాబట్టి అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

# ఆషాఢం అడ్డొచ్చింది



వేములవాడ : రాజన్న ఆలయ గోశాలలోని కోడెల ఉచిత పంపిణీకి ఆషాఢం దెబ్బ తగిలింది. కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు కొంత కాలం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 6 నుంచి ఆషాఢం ప్రారంభం కావడంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి భక్తుల రాక తగ్గిపోయింది. దీంతో స్వామివారికి భక్తులు నిజ కోడెలను సమర్పించకపోవడంతో గోశాలకు కోడెలు రావడం లేదు. శ్రావణ మాసం మొదలైతే తప్ప భక్తులు నిజకోడెలను సమర్పించి మొక్కులు చెల్లించుకునే పరిస్థితి లేదు. దీంతో ఉచిత కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న అన్నదాతలు కొంతకాలం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దరఖాస్తుదారులకు శ్రావణ మాసం వస్తే తప్ప కోడెలు పంపిణీ చేసే పరిస్థితి లేదు. ప్రస్తుతం తిప్పాపూర్ గోశాలలో తక్కువ సంఖ్యలో కోడెలు ఉండటంతో పంపిణీని ఆలయ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. గోశాలకు కోడెలు వచ్చిన తరవాత క్రమ సంఖ్య ప్రకారం తిరిగి పంపిణీకి చర్యలు చేపట్టనున్నారు.వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం కోడె మొక్కులకు ప్రసిద్ధి. స్వామివారిని దర్శించుకునే భక్తులు స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకోవడంతో పాటు నిజ కోడెలను సమర్పిస్తుంటారు. స్వామివారికి సమర్పించిన నిజకోడెలను ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తుంటారు. ఈ గోశాలలోని కోడెలను గత డిసెంబర్ వరకు తెలంగాణ గోశాల ఫెడరేషన్ అనుమతితో రాష్ట్రంలోని వివిధ గోశాలలకు ఉచితంగా పంపిణీ చేసేవారు. ఇలాంటి సందర్భంలో కోడెలు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలతో గోశాలలకు పంపిణీ నిలిపివేశారు. దీంతో గత ఆరు నెలలుగా భక్తులు సమర్పించిన కోడెలు తిప్పాపూర్ గోశాలలో సామర్థ్యానికి మించి నిల్వ ఉండి అనారోగ్యం పాలై మృతి చెందుతుండటంతో వాటిని అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. కలెక్టర్ ఛైర్మన్‌గా వివిధ శాఖల అధికారులతో కమిటీ వేసి ఈ నెల 3 నుంచి 10 వరకు ఉచితంగా కోడెలను పంపిణీ చేశారు. గోశాలలో మొత్తం 1,500 వరకు కోడెలు, ఆవులు ఉన్నాయి. ఇప్పటి వరకు అర్హులైన 700 మంది రైతులకు రెండు కోడెలు చొప్పున, ఆవులను ఒకటి చొప్పున అందజేశారు.

**2,500 పైనే దరఖాస్తులు**

రాజన్న కోడెల ఉచిత పంపిణీకి రైతుల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో కోడెల కోసం దరఖాస్తు చేసుకున్నవారు 2,500 మందిపైగా ఉన్నట్లు ఆలయ అధికారులు చెబుతున్నారు. ఇందులో దాదాపు 700 మందికి కోడెలు, ఆవులను పంపిణీ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారితోపాటు ఇతర జిల్లాల నుంచి రైతులు భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకొన్నారు. క్రమ సంఖ్య ప్రకారం పంపిణీ చేసిన ఆలయ అధికారులు గోశాలలో కోడెల సంఖ్య తగ్గిపోవడంతో పంపిణీ నిలిపివేశారు. ఈ విషయం తెలియని చాలా మంది రైతులు ఇటీవల ఆలయ ఈవో కార్యాలయం వద్ద కోడెల కోసం నిరసన తెలిపారు. కోడెలు వచ్చిన తరవాత తిరిగి పంపిణీ చేస్తామని చెప్పడంతో వెనుదిరిగారు. దీంతో మళ్లీ ఎప్పుడు పంపిణీ చేస్తారోనని దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు.

శ్రావణ మాసంలో...నాగుల మహేశ్, గోశాల పర్యవేక్షకుడు, రాజన్న ఆలయం

గోశాలలో కోడెల సంఖ్య తగ్గిపోయింది. శ్రావణ మాసంలో తిరిగి అర్హులైన రైతులకు క్రమ సంఖ్య ప్రకారం కోడెలను పంపిణీ చేస్తాం. ఆషాఢం కావడంతో ఆలయానికి భక్తుల సంఖ్య తగ్గిపోవడంతో గోశాలకు కోడెలు రావడం లేదు.

# వర్సిటీలు.. ఖాళీలు

హైదరాబాద్ : విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులు.. సహ ఆచార్యుల పదవీవిరమణలు విద్యార్థుల బోధనపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 11ఏళ్ల నుంచి వర్సిటీల్లో శాశ్వత నియామకాలు చేపట్టకపోవడం.. మూడు దశాబ్దాల క్రితం సహాయ ఆచార్యులుగా ఉద్యోగాల్లో చేరిన వారు క్రమంగా ఉద్యోగ విరమణ చేస్తుండటంతో పోస్టులు వేగంగా ఖాళీ అవుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నెలాఖరు వరకు హైదరాబాద్‌లోని ఐదు విశ్వవిద్యాలయాల్లో 60మందికి పైగా ఆచార్యులు, సహ ఆచార్యులు పదవీ విరమణ చేశారు. కొత్త నియామకాలపై ప్రభుత్వం దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి.

**బోధన అంతంతే.. ప్రాజెక్టులు వెనక్కి..**

రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లోని ఆచార్యులు కొరత కారణంగా విద్యార్థులకు సరిగా తరగతులు జరగడం లేదు. ఉస్మానియా, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జేఎన్ఏ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయాల్లోని కొన్ని విభాగాల్లో ఒకరిద్దరు ఆచార్యులు మాత్రమే ఉన్నారు. దీంతో పరిశోధనలు చేసేందుకు సహకరిస్తున్న సంస్థలకు వెనక్కి వెళ్తున్నాయి. ఇలా ఏటా రూ.800కోట్ల విలువైన పరిశోధన ప్రాజెక్టులు తరలిపోతున్నాయని విశ్రాంత ఆచార్యులు, విద్యానిపుణుల అంచనా. ఒక్కో ప్రాజెక్టుకు రూ.10లక్షల నుంచి రూ.కోటి వరకూ ప్రాయోజిత సంస్థలు వెచ్చిస్తున్నాయి.



సహాయ ఆచార్యులుంటేనే.. వర్సిటీల్లో బోధనాప్రమాణాలు మెరుగుపడాలన్నా, బహుళజాతి సంస్థలకు ప్రాజెక్టులు, పరిశోధనలు చేయాలన్నా సహాయ ఆచార్యులుంటేనే సాధ్యం. శాశ్వత నియామకాలు చేపట్టకపోవడంతో అన్ని విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిన నియమించారు. కాంట్రాక్టు పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనులు చేస్తున్నారు కదా అన్న ధోరణిలో గత ప్రభుత్వం వర్సిటీల్లో ఖాళీ పోస్టుల భర్తీని పక్కనపెట్టింది. దీంతో అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందుతున్నారు. శాశ్వత పద్ధతిలో నియమితులైన అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు విధులు నిర్వహిస్తున్నా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తుండడంతో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులుండడం లేదు. ఇప్పటికైనా క్రమబద్ధీకరించాలని ఉస్మానియా, జేఎన్‌టీయూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక వర్సిటీల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు.

# మనకిదో 'పెద్ద'గుణపాఠం!

పెనుబల్లి : సహజసిద్ధ ప్రకృతి వనరు నీరు. నదులు, వాగులు, వంకలకు అడ్డుగా కట్టిన ఆనకట్టల్లోకి నీటిని చేర్చటం ఎంత ముఖ్యమో ప్రవాహానికి అనుగుణంగా దిగువకు పంపటం అంతే ప్రధానం. జలాశయాల్లో ఒడిసిపట్టిన నీటిని జాగ్రత్తగా విడిచిపెట్టకుంటే ఉపద్రవాలే సంభవిస్తాయి. ఈ ప్రక్రియలో కీలక భూమిక వహించే ప్రాజెక్టు గేట్లు, తూముల షట్టర్లు, పంట కాల్వలకు నీటిని తీసుకెళ్లే కాల్వలను పకడ్బందీగా నిర్వహించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా నష్టం తీవ్రత ఊహకందదు. అశ్వారావుపేట మండలంలో భారీ వర్షాలకు కొట్టుకపోయిన పెద్దవాగు ఆనకట్టే ఇందుకు ప్రబల నిదర్శనం. ఈ ఘటన నేపథ్యంలో ఉభయ జిల్లాల్లో పలు మధ్య, చిన్నతరహా ప్రాజెక్టుల నిర్వహణ తీరుపై బృంద కథనం.

సత్తుపల్లి నియోజకవర్గంలో ఏకైక మధ్యతరహా జలాశయమైన పెనుబల్లి మండలం లంకాసాగర్ ప్రాజెక్టు పటిష్టత ప్రశ్నార్థకంగా మారింది. వేల ఎకరాలకు సాగు నీరందించే జలాశయం ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. డ్యామ్ లీకవుతోంది. అలుగు మూడు గేట్లు పడిపోవడంతో వాటికి ఇటీవల మరమ్మతులు చేశారు. మిగతావి చేయాల్సి ఉంది. పెద్ద వాగు పరిస్థితి ఇక్కడ సంభవిస్తే వేల ఎకరాలు నీట మునిగిపోవడంతో పలు గ్రామాల ప్రజలు నిరాశ్రయులవుతారు. నిపుణుల బృందం సూచించినా.. ఏడాది క్రితం హైదరాబాద్ నుంచి వచ్చిన స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ అధికారుల బృందం ప్రాజెక్టును పరిశీలించి లోపాలు గుర్తించారు. వారి సూచన మేరకు ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.24.45కోట్ల అంచనాతో నివేదిక తయారు చేసి పంపారు. ఇంతవరకు నిధులు మంజూరు చేయలేదు. స్థిరీకరించిన ఆయకట్టు 7,350 ఎకరాలు కాగా మరో 3వేల ఎకరాలకు సాగు నీరందిస్తుంది. పూర్తి స్థాయి నీటిమట్టం 14 అడుగులు కాగా మరో రెండు అడుగులు గేట్లు ఎత్తి నిల్వ చేస్తారు. నీటిమట్టం 16 అడుగులకు చేరిన తరువాత అలుగు ద్వారా అదనపు నీరు కట్లేరులో కలుస్తుంది.

మరమ్మతులు చేయాల్సినవి

కట్ట రివిట్‌మెంట్

డ్యామ్ లీకేజీలు

అలుగుపై తుప్పు పట్టిన గేట్లు

క్యాట్‌వాక్ బ్రిడ్జ్ రీ వంతెన రెయిలింగ్

కట్ట వెడల్పు రీ క్యాట్‌వాక్ బ్రిడ్జ్‌కి దిగే మెట్లు.

వెంగళరాయసాగర్‌కు మరమ్మతుల బెంగ

చంద్రుగొండ మండలంలోని అతిపెద్ద నీటి వనరైన వెంగళరాయసాగర్ జలాశయం అలుగు అయిదేళ్ల క్రితం ధ్వంసమైనా నేటికీ పూర్తిస్థాయి మరమ్మతులకు నోచుకోక ప్రమాదం అంచునే ఉంది. 1965లో అప్పటి సీఎం జలగం వెంగళరావు హయాంలో దామరచర్ల–సీతాయిగూడెం గ్రామాల మధ్య ప్రాజెక్టు నిర్మించారు. ప్రాజెక్టు పరిధిలో చంద్రుగొండ, అయ్యన్నపాలెం, దామరచర్ల, సీతాయిగూడెం, మహ్మద్‌నగర్, తిప్పనపల్లి గ్రామాలకు చెందిన 2,200 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు అలుగు 2019లో ధ్వంసమైంది. ఆయకట్టు తగ్గిపోయి 1700 ఎకరాలే సాగవుతోంది. చివరి భూములకు నీళ్లందడంలేదు. ఏటా వర్షాకాలంలో ఒక్క పంటకు నీళ్లందించేందుకు ఇసుక బస్తాల ఏర్పాటుకు రూ.10లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ధ్వంసమైన అలుగు మరమ్మతులకు రూ.33.55 కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నా.. అయిదేళ్లుగా తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టకుంటే అలుగు భాగం మరింత కోతకు గురై ప్రాజెక్టు ఉనికికే ప్రమాదం పొంచి ఉందని ఐబీ అధికారులు, నిపుణులు పేర్కొంటున్నారు.

**'రోళ్లపాడు' అస్తవ్యస్తం..**

టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీ సమీపంలోని రోళ్లపాడు చెరువు తూము గేటు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గేటు శిథిలావస్థకు చేరడంతో పైకీకిందకు రావడం లేదు. ప్రాజెక్టు ఆయకట్టు విస్తీర్ణం 2,042 ఎకరాలు. రైతులు గతేడాది చందాలు వేసుకుని గేటును తాత్కాలికంగా మరమ్మతులు చేయించినా, కొద్ది రోజులకే మొరాయించింది. ఇరిగేషన్ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో గతేడాది చెరువులో పోసిన చేపపిల్లలు వాగులో కలిసిపోయాయి. మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. నిల్వ ఉండకపోవడంతో ఆయకట్టు రైతులు కొరత ఎదుర్కొంటున్నారు. తీవ్ర వర్షాలతో వరద ఉద్ధృతి పెరిగితే పంట పొలాలు నష్టపోయే ప్రమాదం ఉంది.

**గేట్లకు తోడుగా అలుగు..**

ఖమ్మం జిల్లాలో 2.5 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పాలేరు జలాశయం. దీని పూర్తి స్థాయి నీటిమట్టం 23 అడుగులు. 2.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయంలో అంతకుమించి నీటి ప్రవాహం ఉంటే ఆటోమేటిక్ ఫాలింగ్ గేట్ల ద్వారా పాలేరు ఏటి దిగువకు ప్రవహిస్తాయి. గతేడాది జులై 24న రాత్రి గేట్లు మొరాయించటంతో జలాశయంలో పోటెత్తిన వరద నీరు అలుగు ద్వారా దిగువకు ప్రవహించాయి. సిబ్బంది జాకీల ద్వారా గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. పుణెకు చెందిన ప్రముఖ సంస్థ గార్డుబోలే ఇంజినీర్లు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. గేట్ల ద్వారా 83వేల క్యూసెక్కుల వరద నీరు బయటకు వెళ్లగలుగుతుందని, అదనంగా 270 మీటర్ల పొడవైన అలుగు ఉండటంతో జలాశయానికి ఎలాంటి ప్రమాదం ఉండదని జలవనరుల శాఖ ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు చెప్పారు.

**మొరాయిస్తున్నాయ్..**నేలకొండపల్లి మండలంలోని చెర్వుమాదారం చెరువు గేట్లు మొరాయిస్తున్నాయి. 0.83 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ఈ జలాశయం నుంచి నందిగామ బ్రాంచి కాలువకు నీటిని విడుదల చేస్తారు. గేట్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వరద పోటెత్తితే అలుగు ద్వారానే ప్రవహిస్తుంటాయి.

## జీపీఎస్‌తో ఎయిర్‌టెక్ యంత్రాల జాడ

హైదరాబాద్: ఎయిర్‌టెక్ యంత్రం ఎక్కడుంది.. మురుగు నీటి సమస్య పరిష్కరించడానికి ఎంత సమయం తీసుకుంది ఇలా వాటి సేవలపై జలమండలి నిఘా పెట్టేందుకు సిద్ధమైంది.ప్రతి ఎయిర్‌టెక్ యంత్రానికి జీపీఎస్‌ను అమర్చి అక్రమాలకు చెక్ పెట్టనున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా జలమండలి 26 డివిజన్లలో 225 ఎయిర్‌టెక్ యంత్రాలు పనిచేస్తున్నాయి. వీటిని జలమండలి అద్దె ప్రాతిపదికన నిర్వహిస్తోంది. ఏటా రూ.15 కోట్లపైనే ఖర్చు చేస్తోంది. ప్రతి యంత్రం నిత్యం 500 రన్నింగ్ మీటర్ల మురుగు పైపులను శుభ్రం చేయాలి. లాగ్ పుస్తకాల్లో తప్పుడు సమాచారం నమోదు చేసి అక్రమాలకు పాల్పడుతున్నారు. 200 రన్నింగ్ మీటర్లు చెత్త తీసి...500 మీటర్లుగా నమోదు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిఘా లేకపోవడం ఇందుకు దోహదం చేస్తోంది.

**ప్రైవేటు సేవలో తరిస్తూ...**

ఎక్కడైనా మురుగు పొంగితే వెంటనే ఈ యంత్రాలు సమస్యను పరిష్కరించాలి. జలమండలి వినియోగదారుల సేవా కేంద్రం 155313కు ఫోన్ చేసి 2-3 రోజుల దాటినా ఉపయోగం ఉండటం లేదు. నెలకు 20 వేల నుంచి 30 వేల వరకు కేవలం మురుగు సంబంధించి సమస్యలపైనే ఫిర్యాదు చేస్తున్నారు. గతంలో పని చేసిన కొంతమంది విశ్రాంత ఉద్యోగుల బంధువుల పేరుతో కొని అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

# పాలవెల్లువ కావాలి

కొత్తగూడెం : పాలు, అనుబంధ ఉత్పత్తులకు ప్రాధాన్యం పెరిగింది. కొవిడ్ మహమ్మారి తర్వాత పరిణామాలను పరిశీలిస్తే ప్రతి ఇంట్లోనూ పాలు, పెరుగు, మజ్జిగ వాడకం పెరిగింది. ఈ క్రమంలో జిల్లాలో ఉత్పత్తి పెంపుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల అవసరాలకు తగ్గట్టు పాల ఉత్పత్తులు స్థానికంగా పెరగడం లేదు. అత్యధిక శాతం దిగుమతిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. ప్రభుత్వ డెయిరీతో పోల్చిచూస్తే పలు ప్రైవేటు సంస్థలే ఎక్కువగా పాల ప్యాకెట్లు సరఫరా చేస్తున్నాయి. ఇదే సమయంలో కొందరు అక్రమార్కులు నకిలీ ఉత్పత్తులతో ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. నకిలీ పాల బెడదకు పరిష్కారంగా ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీని బలోపేతం చేయాలనే డిమాండ్ కొన్నేళ్లుగా వినిపిస్తోంది. పాడి రైతులకు తగిన ప్రోత్సాహం లభించడం లేదు. ఇంటికో పాడిగేదెను పంపిణీ చేస్తామన్న ప్రభుత్వాల హామీని సక్రమంగా అమలు చేయడం లేదు. వ్యవసాయం నుంచి చాలా మంది రైతులు దూరం కావడంతో అనుబంధ పాడి ఉత్పత్తులపైనా ప్రభావం చూపుతోంది. డెయిరీలను ప్రోత్సహిస్తే సత్ఫలితాలుంటాయి.

ప్రోత్సాహకాలు అంతంతే..



జిల్లాలోని కొత్తగూడెంలో 5 వేల లీటర్లు, ఇల్లెందులో వెయ్యి లీటర్ల సామర్థ్యంతో విజయ డెయిరీ పాల కేంద్రాలు (బల్క్ మిల్క్ యూనిట్లు) ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 80 పాల సేకరణ కేంద్రాలు కొనసాగుతున్నాయి. కానీ జిల్లాలో రోజుకు సుమారు 15 వేల లీటర్ల పాల డిమాండ్ ఉంది. కానీ సామర్థ్యానికి సరిపడా పాల సేకరణ సైతం జరగడం లేదు. కొత్తగూడెంలో ప్రస్తుతం 2,000, ఇల్లెందులో 500 లీటర్ల సేకరణతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. జిల్లా కేంద్రం అవసరాలు తీరేలా 5 వేల లీటర్లకు పాల సేకరణ పెంచాలనే లక్ష్యం నీరుగారుతోంది. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల బలోపేతంతోనే ఇది సాధ్యమవుతుంది. రైతులకు ప్రోత్సాహకాలు అందేలా విజయ డెయిరీ అధికారులు సంఘాలను సమాయత్తపరచాలి. పది శాతం వెన్న ఉంటే ప్రస్తుతం లీటరు పాలకు రూ.80 చెల్లిస్తున్నారు. ప్రభుత్వం మరో రూ.4 కలిపి మొత్తం రూ.84 చెల్లిస్తోంది. దీంతో పాటు ప్రభుత్వ సహకారంతో గేదెల రుణాలు, రాయితీపై దాణా పంపిణీ, పశువైద్య సహకారం అందించడం ద్వారా జిల్లాలో పాల సేకరణ లక్ష్యాన్ని పెంచడంపై అధికారులు దృష్టిసారించారు.

డిమాండ్ పెరగడంతో కల్తీల బెడద

వినియోగానికి తగిన విధంగా ఉత్పత్తి జరగకపోవడంతో కొందరు కల్తీ పాలను తయారు చేసి విక్రయస్తున్నారని సమాచారం. కొద్ది పాలల్లో నీళ్లు కలపడంతో పాటు చిక్కదనం కోసం యూరియా, పామాయిల్, కాస్టిక్ సోడా, డిటర్జెంట్ పౌడర్, ఉప్పు, పంచదార వంటివి ఉపయోగించి వినియోగదారులను మోసగిస్తున్నారు. పట్టణంలో పాలు విక్రయించే వారు కొందరు విద్యానగర్, లక్ష్మీదేవిపల్లి తదితర గ్రామ శివార్లలోనే నీళ్లు, పాడితో కల్తీ పాలు తయారు చేస్తున్నా పట్టించుకునే వారు లేరు. ప్రజారోగ్య పరిరక్షణకైనా సంబంధిత అధికారులు అక్రమార్కులపై చర్యలు చేపట్టాలి.

పాల ఉత్పత్తి పెంపునకు చర్యలు

జి.ధనరాజ్, ఉపసంచాలకుడు, విజయ డెయిరీ

జిల్లాలో పాల ఉత్పత్తులు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసేందుకు రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. వారి సమస్యలను పరిష్కరిస్తున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలు ఎలాంటి మధ్యవర్తుల్లేకుండా నేరుగా పాడి రైతులకు అందేలా చర్యలు తీసుకొంటున్నాం.

# సరకు సర్కారుకు తెలిసేలా..

ఆర్మూర్ : వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించింది. ముఖ్యంగా నకిలీ, కల్తీ విత్తనాలు ఉండకుండా చర్యలు తీసుకుంటుంది. ఇందుకోసం నూతన మార్గదర్శకాలు విడుదల చేసింది. వాటిని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు వ్యవసాయశాఖ కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాలతో ఏ రోజుకారోజు ఏ రైతుకు ఏ విత్తనం అందిందో ఏవో కార్యాలయానికి సమాచారమందేలా కార్యాచరణ సిద్ధం చేశారు. రైతు పేరుతో పాటు తండ్రి పేరు, గ్రామం, మండలం, ఏ పంటకు ఏ వంగడం, ఏ కంపెనీది, ఎంత విక్రయిస్తున్నారనేది ఇన్‌వాయిస్‌తో పొందుపర్చాలని సూచిస్తున్నారు. ఇందుకు జిల్లాలోని పంపిణీదారులు, విక్రయదారులకు వ్యవసాయ శాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. నిత్యం తనిఖీలు చేస్తూ క్షేత్రస్థాయిలో వివరాలు ఆరా తీస్తున్నారు.

నకిలీవిస్తే కేసులే..

జిల్లాలో 605 విత్తన విక్రయ లైసెన్స్ దుకాణాలున్నాయి. 450 క్రియాశీలకంగా నడుస్తాయి. పల్లెల్లో అనధికారికంగా మరో 300 దుకాణాలుంటాయి. ఏటా సాగు సీజన్ వచ్చిందంటే నకిలీ బ్రాండ్‌లు రంగప్రవేశం చేస్తాయి. ముఖ్యంగా పత్తి, మిరప, సోయాబీన్‌లో ఎక్కువగా వెలువడతాయి. జిల్లాలో ఎక్కువగా వరి సాగవుతున్న నేపథ్యంలో నకిలీవి వచ్చే ప్రమాదముంది. రైతుకు చేరే విత్తన వివరాలు ప్రత్యేక ఫార్మట్‌లో పొందుపర్చునున్నారు. దీనిని నిత్యం పర్యవేక్షించేందుకు మండల వ్యవసాయాధికారులు తనిఖీ చేసిన ఫొటో, సమయంతో సహా ఉన్నతాధికారులకు చేరవేయాలి. విక్రయదారులు తమకిష్టమైనవి రైతులకు అంటగడితే కేసులు నమోదు చేయనున్నారు. ప్రత్యేక తనిఖీ బృందాలను రంగంలోకి దింపింది.

ఉత్పత్తి సంస్థలపై నిఘా పెంచాలి..జిల్లాలో విత్తనోత్పత్తి విస్తృతంగా ఉంది. వరితో పాటు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, శనగ పంటలు ఉత్పత్తి చేసి దేశవ్యాప్తంగా సరఫరా చేస్తుంటారు. ఆయా కంపెనీలు నాసిరకం విత్తనాలు తీసుకునేందుకు విముఖత చూపితే వాటిని ఉత్పత్తిదారులు మార్కెట్‌లో ఏదో ఒక కంపెనీ పేరుతో విడుదల చేసేందుకు ప్రయత్నిస్తారు. పేరెన్నికగన్న కంపెనీలు సైతం స్థానిక విత్తనశుద్ధి కేంద్రాల(ప్రాసెసింగ్ యూనిట్లు) నుంచి నేరుగా ప్యాకింగ్ చేసి చెలామణి చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. సంచులను ముందే నిల్వ చేసి అవసరమైనప్పుడు మార్కెట్‌లోకి వదులుతుంటారు. అధికారుల పర్యవేక్షణ కొరవడి విత్తనం ఎక్కడ ఉత్పత్తి అవుతుంది? ఎక్కడ విక్రయిస్తున్నారనే సమాచారం లేకుండానే వ్యవహారం నడుస్తోంది. యంత్రాంగం విత్తన ఉత్పత్తి సంస్థల నిల్వలపై నిఘా పెంచితే నకిలీలకు అడ్డుకట్ట వేసినవారవుతారని రైతులు అభిప్రాయపడుతున్నారు. నిరంతరం పర్యవేక్షిస్తున్నాంకొత్త మార్గదర్శకాల ప్రకారం విత్తనం, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని దుకాణదారులకు అవగాహన కల్పించాం. పూర్తి వివరాలు లేనివి అమ్మితే కేసులు నమోదు చేస్తాం. విత్తన నిల్వలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

# అతివల ఆర్థిక అభ్యున్నతికి అండ



పెద్దపల్లి : ఉమ్మడి జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి స్త్రీనిధి రుణాలు అండగా నిలుస్తున్నాయి. అత్యవసర వేళల్లో తోడ్పాటునందిస్తున్నాయి. వడ్డీ వ్యాపారుల ఒత్తిడి లేకుండా చిరు వ్యాపారాల నిర్వహణతో ఆర్థిక బలోపేతం వైపు అడుగులు పడేలా సహకరిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి స్త్రీనిధి కింద ఉమ్మడి జిల్లాలో రూ.238.04 కోట్ల రుణాలు పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. సభ్యులు కోరిన 48 గంటల్లో వారి ఖాతాలో నిధులు జమ అవుతున్నాయి. స్వల్పకాలిక రుణాలతో పాటు రాయితీపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా ఉంది. ఈ ఏడాది రుణ పంపిణీ లక్ష్య సాధనకు అధికారుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

సభ్యులకు వ్యక్తిగతంగా మంజూరు

ఉమ్మడి జిల్లాలో 40 వేలకు పైగా స్వశక్తి సంఘాలున్నాయి. సభ్యులకు బ్యాంకు లింకేజీతో పాటు స్త్రీనిధి రుణాలు ఆర్థిక చేయూతనిస్తున్నాయి. బ్యాంకు లింకేజీ రుణాలు స్వశక్తి సంఘం పేరిట మంజూరు చేస్తుండగా స్త్రీనిధి రుణం మాత్రం సభ్యులకు వ్యక్తిగతంగా ఇస్తున్నారు. వడ్డీ వ్యాపారుల బారిన పడిన కుటుంబాలను ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని అతివలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ ఏడాది రూ.238.04 కోట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బ్యాకు లింకేజీ కింద ప్రతి సంఘానికి అందించే రుణ మొత్తాన్ని కొన్నేళ్లుగా భారీగా పెంచారు. ప్రతి సంఘానికి రూ.10 లక్షల వరకు మంజూరు చేస్తుండటంతో ఈ ప్రభావం స్త్రీనిధి రుణ పంపిణీపై పడుతోంది. వ్యక్తిగతంగా అందజేసే స్త్రీనిధి రుణాన్ని తీసుకునేవారు తక్కువగా ఉండటంతో సంఘాల నిర్వాహకులు సెర్ప్ అధికారుల సహకారంతో లక్ష్యాలు చేరుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రూ.5 వేల నుంచి రూ.5 లక్షల వరకుసూక్ష్మ రుణ సంస్థల నిర్వాహకుల ఆగడాల నుంచి అతివలను రక్షించేందుకు 2011లో స్త్రీనిధి రుణ పథకాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా స్వశక్తి సంఘాల్లోని సభ్యులకు వ్యక్తిగతంగా రూ.5 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించారు. వ్యవసాయం, పిల్లల చదువులు, ఆడ పిల్లల వివాహాలు, ఇతర అవసరాలకు రుణం మంజూరు చేస్తున్నారు. వడ్డీ వ్యాపారుల బెడద లేకుండా స్త్రీనిధి రుణాలను అతివలు వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. అనంతరం కిస్తీ వాయిదాలు సక్రమంగా చెల్లించిన వారికి పావలా వడ్డీ వర్తింపజేస్తున్నారు.

# ముంపు ముప్పు తప్పేనా?



సిరిసిల్ల : వర్షం కురిస్తే చాలు సిరిసిల్ల పురపాలక సంఘంలోని లోతట్టు కాలనీలు జలమయం కావడం, ప్రధాన రహదారులపైకి, ఇళ్లలోకి నీరు చేరడం సర్వసాధారణంగా మారింది. పట్టణం చుట్టూ ఉన్న చెరువుల శిఖం ఆక్రమణలతో వాటిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. వరద వెళ్లే కాల్వల వెంట అక్రమ నిర్మాణాల వల్ల నీరు వెళ్లే మార్గం లేక రోడ్డుపైకి వస్తోంది. లోతట్టు ప్రాంతాల్లో కాలనీవాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ సమస్యకు కారణమైన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, నాలా నిర్మాణ పనులు మూడేళ్లుగా ముందుకు సాగడం లేదు. ఫలితంగా సమస్యకు పరిష్కారం లభించని పరిస్థితి నెలకొంది.

గుత్తేదారు మారినా...సిరిసిల్ల పట్టణంలో వరద సాఫీగా వెళ్లేందుకు నిర్మించే కాల్వ పనులు అసెంబ్లీ ఎన్నికల కోడ్ నుంచి నిలిచిపోయాయి. ఎగువన చిన్నబోనాల, ఈదుల చెరువు, కొత్త చెరువులోకి వచ్చే వరద ఉద్ధృతిని తట్టుకునేలా 4.5 మీటర్ల వెడల్పుతో చేపడుతున్న సీసీ కాల్వ నిర్మాణానికి 2022లో రూ. 6.21 కోట్లు కేటాయించారు. తొలుత పనులు దక్కించుకున్న గుత్తేదారు ఆక్రమణల తొలగింపులో జాప్యం చేయడం, ప్రజాప్రతినిధుల ఒత్తిడితో పనులు మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. తర్వాత దీనిని మూడు భాగాలుగా చేసి జీహెచ్‌ఎంసీలో పనులు చేసిన మరో గుత్తేదారుకు అప్పగించారు. ఈ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వరద వస్తే అంబికానగర్, వెంకంపేట, పద్మానగర్, అశోక్‌నగర్, అనంతనగర్, సంజీవయ్యనగర్‌లను వరద ముంచెత్తుతోంది. ప్రస్తుతం పట్టణంలోని సిరిసిల్ల-కరీంనగర్, కామారెడ్డి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాల్వలోని పూడికతీత పనులు జరుగుతున్నాయి.

రూ.55 కోట్ల పనులకు బ్రేక్ సిరిసిల్ల పట్టణంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు పలు కాలనీల్లో సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలకు సీడీఎంఏ నుంచి రూ.40 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో చాలా వరకు టెండర్లు పూర్తయ్యాయి. పనులు ప్రారంభించే ముందు ఎన్నికల కోడ్ రావడంతో నిలిపివేశారు. అలాగే కొత్త చెరువు మత్తడి నుంచి శాంతినగర్, శ్రీనగర్ కాలనీ మీదుగా మొదటి బైపాస్ నుంచి తుమ్మలకుంటలోకి వరద వెళ్లేందుకు రూ. 15 కోట్లతో కాల్వ నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. ఇవి టెండర్ల దశలో ఉండగానే ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో ఖజానాలో నిధుల లేమితో వీటిని తాత్కాలికంగా నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో పట్టణంలో అభివృద్ధి పనులు చాలా వరకు నిలిచిపోయాయి.పూడిక తొలగిస్తున్నాంనర్సింహాస్వామి, ఏఈపట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న కాల్వల్లో పూడిక తీత పనులను కూలీలతో చేపడుతున్నాం. మిగతా ప్రధాన కాల్వల్లో పూడిక తీతకు కౌన్సిల్ సమావేశం తర్వాత టెండర్లు ఆహ్వానించి పనులు చేపడతాం. అసంపూర్తిగా ఉన్న వరద కాల్వ నిర్మాణ పనులు కోడ్ పూర్తయ్యాక ప్రారంభిస్తాం. కొత్తచెరువు, శ్రీనగర్ కాలనీలోని మట్టి కాల్వలో సైతం పూడిక తొలగిస్తాం. పట్టణంలో గతేడాదిలా ముంపు లేకుండా చూస్తున్నాం. ఇప్పటికే సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

# విలువైన సామగ్రి మాయం.. ఇంటిదొంగల ప్రమేయం

దామరచర్ల : నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ విద్యుత్తు ప్లాంటు (వైటీపీఎస్)లో రూ.కోట్ల విలువైన సామగ్రి మాయమవుతోంది. నిత్యం ఎస్పీఎఫ్(ప్రత్యేక రక్షణ దళం) పర్యవేక్షణలో ఉన్న ప్లాంటులో వరుస చోరీలు జరుగుతుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది ప్రమేయంతోనే ఈ వ్యవహారాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం సుమారు రూ.3 కోట్ల విలువైన కాపర్(రాగి) తీగ చోరీకి గురైనట్లు బీహెచ్‌ఈఎల్ అధికారులు వాడపల్లి ఠాణాలో ఫిర్యాదు చేయగా, గతంలో జరిగిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం ఈ కేసును జిల్లా ఎస్పీ చందనాదీప్తి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దామరచర్ల మండలం వీర్లపాలెం సమీపంలో సుమారు రూ.30 వేల కోట్ల వ్యయంతో 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కల్గిన 5 కేంద్రాలకు టీజెన్‌కో నిర్మాణ పనులను చేపట్టింది. ప్రధాన పనులను బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించింది. నిర్మాణంలో భాగంగా 2016 నుంచి సామగ్రి, విడిభాగాలను ప్లాంటు ఆవరణలో నిల్వ చేస్తున్నారు. ప్లాంటు లోపల, ప్రధాన ధ్వారం ఎదురుగా రెండు ప్రాంతాలలో సామగ్రితో పాటు, విలువైన విడిభాగాలు, ఇనుమును ఉంచి అవసరమైన సమయంలో వినియోగిస్తున్నారు. సామగ్రిలో అధిక భాగం బీహెచ్‌ఈఎల్ కు చెందినది కాగా, మిగతాది టీజెన్‌కోది. రూ.కోట్ల విలువైన ఈ సామగ్రిని కొందరు మాయం చేస్తున్నట్లుగా ఐదేళ్లుగా పలుమార్లు ఫిర్యాదులు రాగా.. వాటిని బయటికి పొక్కకుండా లోలోపల రాజీ చేశారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు 15 మందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. గతంలో జరిగిన చోరీలు సైతం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఇప్పటి వరకు రూ.20 కోట్లకు పైగా విలువ గల సామగ్రి మాయమైనట్లు తెలుస్తోంది. ఇందులో ప్లాంటులో పనిచేసే అధికారులు, సిబ్బంది పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది.



వైటీపీఎస్ ప్లాంటు ఎస్పీఎఫ్ ఆధీనంలో ఉన్నప్పటికీ విలువైన సామగ్రి చోరీ కావడంపై నిఘా ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.డీఎస్పీతో పాటు సీఐ స్థాయి అధికారి, నలుగురు ఎస్సైలు, 50 మంది సాయుధ బలగాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, వాచ్‌టవర్లు ఉన్నప్పటికీ ఇనుము, విలువైన సామగ్రి నేరుగా డీసీఎం, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారంటే ఇంటిదొంగల ప్రమేయం లేకుండా సాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ విషయమై టీజెన్‌కో సీఈ సమ్మయ్య మాట్లాడుతూ.. సామగ్రి చోరీ జరుగుతున్న విషయం వాస్తవమేనని, ఇది బీహెచ్‌ఈఎల్‌కు సంబంధించిన విషయమని, వారు చూసుకుంటారని తెలిపారు. ప్లాంటు భద్రతను పర్యవేక్షించే ఎస్‌టీఎఫ్‌పై తమ అజమాయిషీ ఉంటుందని వెల్లడించడం గమనార్హం.

# ధాన్యం బదిలీ ఒప్పందాలపై ఉదాసీనత

నిజామాబాద్ : మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం కేటాయించారు. కస్టమ్ మిల్లింగ్ చేసి బియ్యం తిరిగివ్వాల్సిన గడువు ముగిసినా పెద్ద ఎత్తున బకాయిలు పేరుకుపోయాయి. అయినా తర్వాత సీజన్లో సదరు మిల్లులకు ధాన్యం ఇచ్చారు. దీనికితోడు ఓ మిల్లుకు కేటాయించిన ధాన్యాన్ని మరోదానికి బదిలీ జరిగింది. ఈ క్రమంలో ఒప్పందాలు, అంగీకార పత్రాలు రాసుకున్నా.. మొదట కేటాయించిన మిల్లరు తమకు వడ్లు అప్పగించలేదంటూ రెండో మిల్లరు కొత్త వివాదం తెరపైకి తెచ్చారు. ఇది 2021-22 వానాకాలం, యాసంగి సీజన్లలో పౌరసరఫరాలశాఖ సీఎంఆర్ కోసం మిల్లులకు కేటాయించిన ధాన్యం విషయంలో చోటుచేసుకున్న గందరగోళం. ఈ వ్యవహారంలో దాదాపు రూ.100 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు విమర్శలొచ్చాయి. గతేడాదిలో సీఎంఆర్ ముగిశాక ఆయా మిల్లుల్లో తనిఖీలు చేయగా ధాన్యం నిల్వలు కనిపించలేదు. తిరిగివ్వాల్సిన బియ్యం పెద్ద మొత్తంలో బకాయి పడింది. అధికారులు నిలదీస్తే తమకు పూర్తిస్థాయిలో ధాన్యం బదిలీ జరగలేదంటూ తాపీగా సమాధానాలిచ్చారు అంగీకార పత్రాలిచ్చిన మిల్లుల యాజమాన్యాలు. ఈ వివాదమే శాఖాపరమైన విచారణకు దారితీసింది. పౌరసరఫరాల డీఎస్‌వో చంద్రప్రకాష్, డీఎం జగదీష్‌కుమార్ సస్పెన్షన్‌కు ఈ వ్యవహారమే కారణమైంది.

వివాదం బోధన్ డివిజన్‌లోనే..

మాజీ ఎమ్మెల్యే షకీల్ కుటుంబానికి చెందిన నాలుగు మిల్లులకు 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలంలో ధాన్యాన్ని కేటాయించారు. వడ్ల బస్తాలు వారి మిల్లుల్లో దింపిన తర్వాత వారు సీఎంఆర్ బాధ్యత నుంచి తప్పుకొంటున్నట్లు చెప్పారు. మిల్లులు



నడపలేనని..కేటాయించిన ధాన్యాన్ని ఇతర మిల్లులకు ఇచ్చుకోవాలన్నారు. ఈ సమయంలో ధాన్యం తీసుకొనేందుకు ఇతర మిల్లర్లు ముందుకొచ్చారు. వారితో సీఎంఆర్ బకాయిల చెల్లించే బాధ్యత తమదంటూ పత్రాలు రాయించుకున్నారు. కానీ, గడువు దగ్గరపడుతున్నా.. సదరు మిల్లర్లు తిరిగివ్వలేదు. తనిఖీలకు వెళితే వారి వద్ద ధాన్యం లేదు. అడిగితే మాజీ ఎమ్మెల్యే మిల్లుల నుంచి తమకు కొంత మాత్రమే ధాన్యం వచ్చిందని.. పూర్తిస్థాయిలో అప్పగించలేదని సమాధానమిచ్చారు. ఈ సందర్భంలో మాజీ ఎమ్మెల్యే మిల్లుల్లోనూ పరిశీలిస్తే ధాన్యం నిల్వలు లేవు. పైగా డివిజన్‌లోని మరో మిల్లు నుంచి కూడా మూడు మిల్లులకు ధాన్యం బదిలీ చేశారు. ఇక్కడా సీఎంఆర్ బకాయిలు పేరుకుపోయాయి.

గతేడాదే వెలుగులోకి..

మాజీ ఎమ్మెల్యే షకీల్ కుటుంబానికి చెందిన నాలుగు మిల్లులు, సైరస్ ఆగ్రో ఇండస్ట్రీస్ పేరుతో ఉండే మరో మిల్లులకు కేటాయించిన వడ్ల విషయంలోనే వివాదం మొదలైంది. ఈ ఐదు మిల్లుల నుంచి ఇదే ప్రాంతానికి చెందిన ఏడు మిల్లులకు ధాన్యం బదిలీ చేసినట్లు పైన పేర్కొన్న అయిదు మిల్లుల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఏడు మిల్లుల యాజమాన్యాలు ఇందుకు పౌరసరఫరాలశాఖకు పత్రాలు కూడా రాసిచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈ ఏడుగురు మిల్లర్లు సీఎంఆర్ ఎగవేతకు పాల్పడ్డారు. ఈ విషయం గతేడాదే గుర్తించారు. వీరిలో అయిదు మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టారు. రికవరీ చట్టం కింద నోటీసులు సైతం ఇచ్చారు. మరో ఇద్దరు మిల్లర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారు. రికవరీలో భాగంగా ఏడు మిల్లుల నుంచి కొంత మేర వసూలు చేశారు. ఇంకా రూ.72.50 కోట్ల మేర బకాయిలున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇద్దరు జిల్లా అధికారులపై వేటు

మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం కేటాయించటం, సీఎంఆర్ బకాయిలు పేరుకుపోవటం వ్యవహారంపై అధికారులు విచారణ చేశారు. క్షేత్రస్థాయిలో వెలుగుచూసిన విషయాలపై ఉన్నత స్థాయికి నివేదిక పంపారు. దీని ఆధారంగా జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిగా ఉన్న చంద్రప్రకాష్, డీఎంగా ఉన్న జగదీష్‌కుమార్‌ను బాధ్యులుగా గుర్తించారు. ఈ మేరకు ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు ఇచ్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో డీసీఎస్‌వోగా ఉన్న పద్మకు నిజామాబాద్ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

# ఎరువుల అమ్మకాల్లో గోల్‌మాల్

మాక్లూర్ : జిల్లాలోనే అతి పెద్ద సహకార సంఘంగా పేరొందిన మాక్లూర్‌లో.. అవినీతి అక్రమాలు సైతం అదే స్థాయిలో జరుగుతున్నాయి. కొందరు రైతుల సొమ్మును అందినకాడికి దండుకుంటున్నారు. సుమారు రూ.కోటి దుర్వినియోగమైనట్లు అధికారుల విచారణలో తేలగా.. తాజాగా ఎరువుల అమ్మకాల్లో మరో రూ.27లక్షలు గోల్‌మాల్ అయినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఒకరి చేతివాటం..

మాక్లూర్ విండో పరిధిలోని గుత్ప కేంద్రంలో ఆరు నెలల క్రితం అన్నదాతలకు అవసరమయ్యే రూ.30లక్షల విలువైన ఎరువులను ప్రభుత్వం నిల్వ ఉంచింది. అందులో క్లర్క్‌గా విధులు నిర్వహించే వ్యక్తి చేతివాటాన్ని ప్రదర్శించాడు. ఎరువులు అమ్మగా వచ్చిన రూ.20లక్షలను తన సొంతానికి వాడుకున్నాడు. ఒక అధికారి కూడా రూ.7లక్షలు స్వాహా చేశారు. వారిద్దరూ ఇప్పటి వరకు ఆ డబ్బులను బ్యాంకులో జమ చేయలేదని ఆడిట్‌లో తేలింది. ప్రస్తుతం కేవలం రూ.3లక్షల విలువైన ఎరువులు మాత్రమే అక్కడ నిల్వ ఉన్నాయి.

దుబాయ్ పరార్..?నిధుల దుర్వినియోగానికి పాల్పడిన క్లర్క్ ఐదు నెలల క్రితం దుబాయ్ వెళ్లిపోయినట్లు సమాచారం. డబ్బులు చెల్లించాలంటూ సంబంధిత అధికారులు ఎంత ఒత్తిడి తెస్తున్నా ఆయన మాత్రం పట్టించుకోవడం లేదు. ఇదిగో.. అదిగో అంటూ కాలం వెల్లదీస్తున్నాడు. ఈ క్రమంలో రికవరీ విషయమై నాలుగు రోజుల క్రితం విండో పాలకవర్గం మాక్లూర్‌లో సమావేశమైంది. చరవాణిలో క్లర్క్‌తో చర్చించింది. డబ్బులు ఇవ్వకపోతే ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని ఆయనను హెచ్చరించింది.

రికవరీ చేస్తాం : విష్ణువర్ధన్, కార్యదర్శి

గుత్ప కేంద్రంలో ఎరువుల గోల్‌మాల్ జరిగిన సమయంలో నేను కార్యదర్శిగా విధుల్లో లేను. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు రికవరీ చేస్తాం.



# ఆదాయపు పన్ను కొత్త శ్లాబ్‌లివే..

## 2024: కొత్త పన్ను విధానంలో మార్పులు.. స్టాండర్డ్ డిడక్షన్ పెంపు

దిల్లీ: బడ్జెట్‌లో వేతన జీవికి స్వల్ప ఊరటనిస్తూ కొత్త పన్ను విధానంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొన్ని మార్పులు చేశారు. పన్ను శ్లాబుల్లో మార్పుతో పాటు, స్టాండర్డ్ డిక్షన్ విషయంలో ఊరటనిచ్చారు. ప్రస్తుతం స్టాండర్డ్ డిడక్షన్ రూ .50 వేలుగా ఉండగా.. ఆ మొత్తాన్ని రూ.75 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. దీనివల్ల రూ.17,500 వరకు పన్ను చెల్లింపుదారులు పన్ను ఆదా చేసుకోవచ్చని నిర్మలమ్మ ప్రకటించారు. పన్ను విధానంలో మాత్రం ఎలాంటి మార్పులూ చేయలేదు. మంగళవారం తన బడ్జెట్ ప్రసంగంలో ఈ మేరకు ప్రకటన చేశారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన మార్పుల ప్రకారం.. ఎప్పటిలానే కొత్త పన్ను విధానంలో రూ.3 లక్షల వరకు వరకు ఎలాంటి పన్నూ లేదు. గతంలో రూ.3-6 లక్షల శ్లాబులో 5 శాతంగా పన్ను ఉండేది. ఇప్పుడు ఆ పరిమితిని రూ.7 లక్షలకు పెంచారు. ఆ మేర శ్లాబుల్లో స్వల్ప మార్పు చేశారు. గతంలో రూ.6-9 లక్షల శ్లాబు కూడా రూ.7-10 లక్షలకు మారింది. దీంతో రూ.10 లక్షల వార్షికాదాయం ఉన్న వారికి 10 శాతం పన్ను వర్తించనుంది.

**కొత్త శ్లాబులు ఇలా..** సున్నా నుంచి రూ.3 లక్షల వరకు పన్ను సున్నా, రూ.3-7 లక్షల వరకు 5 శాతం పన్ను, రూ.7-10 లక్షల వరకు 10 శాతం పన్ను, రూ.10-12 లక్షల వరకు 15 శాతం పన్ను, రూ.12- 15 లక్షల 20 శాతం పన్ను , రూ.15 లక్షల పైన 30 శాతం పన్ను




# అమరావతికి రూ.15వేల కోట్ల సాయం

దిల్లీ: రాష్ట్ర విభజన తర్వాత గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను గట్టెక్కించేలా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుభవార్త చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు కేటాయిస్తామని చెప్పారు.

**ఆ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ..** ఈ సందర్భంగా విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం అందిస్తామని కేంద్రమంత్రి తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, రైతులకు జీవనాడి పోలవరం. భారత ఆహార భద్రతకు ఆ ప్రాజెక్టు ఎంతో కీలకమైనది. పోలవరం నిర్మాణం సత్వరం జరిగేలా చూస్తాం" అని నిర్మలమ్మ భరోసానిచ్చారు. ఏపీలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వనున్నట్లు నిర్మలమ్మ ప్రకటించారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేస్తామన్నారు. విభజన చట్టం ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తామని కేంద్రమంత్రి వెల్లడించారు.

హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందిస్తామన్నారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం చేస్తామన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. విశాఖ - చెన్నై కారిడార్‌లో కొప్పర్తికి, హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు ఇస్తామని తెలిపారు.



# బడ్జెట్‌పై మంత్రి స్పందన

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయింపుతో పాటు విభజన చట్టంలో పేర్కొన్న అన్ని అంశాలను అమలు చేస్తామంటూ బడ్జెట్ 2024-25 ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రానికి ఆర్థిక సహకారం అందిస్తామంటూ సీతారామన్ ప్రకటన చేశారు. ఈ ప్రకటనపై ఏపీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పందించారు. "ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టుల పూర్తి కోసం సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు" అని ఆయన తెలిపారు. బడ్జెట్లో రూ.15 వేల కోట్లు కేటాయించి ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి కట్టుబడిన ఎన్డీఏ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. కాగా బడ్జెట్ 2024-25లో ఆంధ్రప్రదేశ్‌కు నిర్మలా సీతారామన్ గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక సాయం చేయనున్నట్లు ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇక విభజన చట్టంలో పేర్కొన్న అన్ని అంశాలను అమలు చేస్తామని భరోసా కల్పించారు. రాష్ట్రానికి ప్రత్యేక ఆర్థిక సహకారం అందించనున్నామని, 2024-25 బడ్జెట్‌లో ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్ల నిధులు కేటాయించనున్నట్లు ప్రకటించారు. ఇక రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటన చేశారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడర్ అభివృద్ధికి నిధులు కేటాయించామని తెలిపారు. ఇక విభజన చట్టంలో పేర్కొన్న వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందిస్తామని, రాయలసీమ, ప్రకాశం జిల్లా, ఉత్తరాంధ్రకు నిధులు కేటాయిస్తామని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి సాయంపై యనమల స్పందన ఇదీ!

అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక సాయం ప్రకటించడం పట్ల మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... ఏపీ ఏం ఆశించిందో వాటిని కేంద్రం బడ్జెట్టులో పొందుపర్చడం సంతోషంగా ఉందన్నారు. అమరావతికి రూ. 15 వేల కోట్లు ఇవ్వడంతో రాజధాని పనులను పరుగులు పెట్టించవచ్చన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో కేంద్రం మరోసారి స్పష్టంగా హామీ ఇవ్వడం శుభ పరిణామమన్నారు. ఆగిపోయిన వెనుకబడిన ప్రాంతాలకు నిధులిస్తామని చెప్పడం రాష్ట్ర ప్రగతికి తొడ్పడుతుందన్నారు. ఏపీలో ఏర్పడిన కొత్త ప్రభుత్వానికి కేంద్రం ప్రకటనలు ఆర్థిక తొడ్పాటు ఇస్తుందని తెలిపారు. ఆర్థికాభివృద్ధి జరుగుతుందన్నారు. ఏపీలో పారిశ్రామిక మౌళిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం ఇవ్వడం వల్ల పారిశ్రామికాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కేంద్ర బడ్జెట్ కేంద్ర, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలు పుంజుకుంటాయన్నారు. స్వర్ణాంధ్ర సాధన దిశగా అడుగులు పడడానికి కేం ద్ర బడ్జెట్ ఉపకరిస్తుందయని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు ఫలించాయన్నారు. ఏపీపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రధాని మోదీకి, ఎన్డీఏ ప్రభుత్వానికి కృతతలు తెలియజేశారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కేంద్ర పథకాలు ఊతమిస్తాయని యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు.

## ఏపీ ప్రజల తరపున ప్రధాని మోదీ, నిర్మలమ్మకు థ్యాంక్స్ : సీఎం చంద్రబాబు

అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించినందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ ప్రజల తరపున సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అవసరాలను గుర్తించి రాజధాని, పోలవరం, పారిశ్రామిక రంగాలపై దృష్టి సారించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నుంచి వచ్చే సహకారం ఏపీ పునర్నిర్మాణానికి చాలా ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రానికి విశ్వాసాన్ని పెంచే బడ్జెట్‌ను సమర్పించినందుకు కేంద్రాన్ని అభినందించారు. ఏపీ మళ్లీ గాడిలో పడుతోందని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ (%ూఅనష్ట్రతీుూాతీుఒవంష్ట్ర%)ను గట్టెక్కించేలా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుభవార్త చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు కేటాయిస్తామని చెప్పారు. "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, రైతులకు జీవనాడి పోలవరం. భారత ఆహార భద్రతకు ఆ ప్రాజెక్టు ఎంతో కీలకమైనది. పోలవరం నిర్మాణం సత్వరం జరిగేలా చూస్తాం" అని నిర్మలమ్మ భరోసానిచ్చారు. ఏపీలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వనున్నట్లు నిర్మలమ్మ (%చీఅతీుఝశ్రీు రాఔష్ట్రుతీుఝఅ%) ప్రకటించారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేస్తామన్నారు. విభజన చట్టం ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తామని కేంద్రమంత్రి వెల్లడించారు. హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందిస్తామన్నారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం చేస్తామన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. విశాఖ - చెన్నై కారిడార్‌లో కొప్పర్తికి, హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు ఇస్తామని కేంద్ర మంత్రి తెలిపారు.



# తొమ్మిది ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా ప్రాధాన్య అంశాలను ఎంపిక చేసుకుంది. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన- నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన- ఆవిష్కరణలు, తయారీ-సేవలు, తర్వాతతరం సంస్కరణలు- ఈ తొమ్మిది అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతూ.. ఈ అంశాలను ప్రకటించారు.

వచ్చే రెండేళ్లలో కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. కూరగాయల ఉత్పత్తి పెద్దఎత్తున చేపట్టేలా క్లస్టర్లను ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు.

# శాసనమండలిలో తిరుమల అవినీతిపై చర్చ..



అమరావతి: ఏపీ శాసనమండలి సమావేశాలు రెండో రోజు మంగళవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తిరుమల అవినీతిపై చర్చ ప్రారంభమైంది. పరకామణిలో భారీ స్థాయిలో దోపిడీ జరిగిందని ఎమ్మెల్యే రామగోపాల్ రెడ్డి ఆరోపించారు. రవికుమార్ అనే ఉద్యోగి రూ. 100 కోట్లు యూఎస్ డాలర్లు పక్కదారి పట్టించారని ఎమ్మెల్యే విమర్శించారు. కేసును కూడా తారుమారు చేశారని , తిరుమలలో జరిగిన అవివీతిపై విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూలేని స్థాయిలో తిరుమలను భ్రష్టుపట్టించారని మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి విమర్శించారు. తిరుమలలో అనేక మాఫీయాలు తయారయ్యాయని, శ్రీ వాణి ట్రస్ట్ నిధులపై విచారణ చేస్తామని మంత్రి ఆనం అన్నారు. కూటమి ప్రభుత్వంలో తిరుమల నుంచే ప్రక్షాళన ప్రారంభించామని, త్వరలోనే తిరుమలను గాడిలో పెడతామని మంత్రి ఆనం సమాధానం ఇచ్చారు. బ్రేక్ దర్శనంకు వారానికి ఆరు రోజుల లేఖలకు అనుమతి ఇవ్వాలని సభ్యులు కోరారు. ఎమ్మెల్యేలతో సమానంగా ఎమ్మెల్సీలకు తిరుమలలో ప్రాధాన్యం ఇవ్వాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు. అలాగే ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తర కార్యక్రమం జరుగుతోంది. ఏపీపీఎస్సీ గ్రూప్ వన్ పరీక్షలపై అసెంబ్లీలో కీలక చర్చ జరిగింది. రాజమండ్రీ రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రశ్నపై చర్చ మొదలైంది. ఏపీపీఎస్సీ అక్రమాలపై విచారణకు నియమించిన కమిటీ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణకు ఆదేశం ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఆగస్టు 31లోపు కమిటీ నివేదిక ఇవ్వాలని ఆదేశించారన్నారు. రిపోర్ట్ వచ్చిన తరువాత సభ్యులు కోరిన విధంగా సీఎం ఆదేశాలు తీసుకుని సీబీఐ విచారణకు సిఫార్సు చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. దీనిపై అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి లోకేష్ ఒక విచారణ కమిటీ నియమించారన్నారు. దీనిపై ఇప్పటికే అధికారులు విచారణ చేపట్టారని మంత్రి పయ్యావుల వెల్లడించారు.

# ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలపై అసెంబ్లీలో కీలక చర్చ




అమరావతి, జూలై 23: ఏపీ అసెంబ్లీ సమావేశాలు రెండో రోజు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏపీపీఎస్సీ గ్రూప్ వన్ పరీక్షలపై అసెంబ్లీలో కీలక చర్చ జరిగింది. రాజమండ్రీ రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రశ్నపై చర్చ మొదలైంది. ఏపీపీఎస్సీ అక్రమాలపై విచారణకు నియమించిన కమిటీ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణకు ఆదేశం ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.

ఆగస్టు 31లోపు కమిటీ నివేదిక ఇవ్వాలని ఆదేశించారన్నారు. రిపోర్ట్ వచ్చిన తరువాత సభ్యులు కోరిన విధంగా సీఎం ఆదేశాలు తీసుకుని సీబీఐ ఎంక్వైరీకి సిఫార్సు చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. దీనిపై అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి లోకేష్ ఒక విచారణ కమిటీ నియమించారన్నారు. దీనిపై ఇప్పటికే అధికారులు విచారణ చేపట్టారని మంత్రి పయ్యావుల వెల్లడించారు.

**ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేయాలి: కొలికపూడి –** ఏపీపీఎస్సీను సొంత జాగీరుగా వాడుకున్నారని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టుల వారీగా డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. గ్రూపు- 2 లో కూడా అదే జరిగిందన్నారు. కోర్టులను తప్పుదారి పట్టించే పనులు చేశారని తెలిపారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. ఏపీపీఎస్సీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కోరారు.

**సీబీఐ ఎంక్వైరీకి ధూళిపాళ్ల పట్టు...** ఏపీపీఎస్సీకి మాజీ డీజీ గౌతం సవాంగ్, పీఎస్ఆర్ ఆంజనేయులు ఇద్దరు కలిసి ఇష్టం వచ్చిన వాళ్ళను ఎంపిక చేశారని ఎమ్మెల్యే ధూళ్ళిపాళ్ళ నరేంద్ర అన్నారు. ఏపీపీఎస్సీ నిబద్ధతపై కూడా సందేహాలు ఉన్నాయన్నారు. మాన్యువల్ వెరిఫికేషన్ జరిగినప్పుడు అవకతవకలు జరిగాయన్నారు. సీనియర్ ఆఫీసర్ల పాత్ర ఉండటంతో దీనిపై సీబీఐ ఎంక్వైరీ జరగాల్సిందే అని పట్టుబట్టారు. ఇష్టం వచ్చినట్టు తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు నిబంధనలు మార్చారన్నారు. దోషులను ఎవరిని కూడా వదిలి పెట్టవద్దని ధూళిపాళ్ల నరేంద్ర డిమాండ్ చేశారు.

# మదనపల్లి అగ్నిప్రమాద ఘటనపై సీన్ రీ కన్‌స్ట్రక్షన్

అన్నమయ్య జిల్లా : మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగిన చోట అడిషనల్ ఎస్పీ రాజకుమార్ సీన్‌ను రీ కన్స్ట్రక్షన్ చేశారు. మదనపల్లి రెవిన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల తహసిల్దార్ కార్యాలయాలల్లో సోమవారం అర్ధరాత్రి వరకు ప్రత్యేక బృందాల తనిఖీలు నిర్వహించాయి. 22 ఏ ఫైల్స్ అన్నింటినీ కూడా ప్రత్యేక అధికారులు సీజ్ చేసి తీసుకెళ్లారు. దీంతో అక్రమాలకు పాల్పడిన అధికారుల గుండెల్లో గుబులు నెలకొంది. డీజీపీ ద్వారక తిరుమలరావు ఆధ్వర్యంలో ముమ్మర విచారణ జరుగుతోంది.

**మదనపల్లికి మరికొంతమంది...** మరోవైపు మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్గంపై సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఘటనపై విచారణ కోసం మరికొందరు ఉన్నతస్థాయి అధికారులు మదనపల్లె వెళ్లనున్నారు. ఘటనపై విచారించేందుకు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాను వెళ్లమని ఆదేశాలు జారీ అయ్యింది. మరోవైపు ఫైర్ సేఫ్టీ డైరెక్టర్, ఏపీజెన్‌కో సీఎండీలను కూడా ఘటనా స్థలానికి వెళ్లి తమ శాఖలకు సంబంధించిన అంశాలపై విచారణ జరపమని సీఎం ఆదేశాలు జారీ చేశారు. నాగపూర్‌కు చెందిన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ ఇంజరీంగ్ సంస్థ నుంచి నిపుణులను ప్రభుత్వం పిలిపించనుంది. ఫైళ్ల దగ్ధంలో కుట్రను తేల్చేందుకు అన్ని మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది. చిన్న ఆధారం దొరికినా వదలకుండా ఘటనకు పాల్పడిన వారిని పట్టుకోవాలనే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

**ఇదీ జరిగింది...** కాగా.. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. '22ఏ' సెక్షన్‌లో మంటలు వ్యాపించాయి. దాదాపు 25 విభాగాల్లోని ఫైళ్లు దగ్ధమయ్యాయి. అయితే అగ్నిప్రమాదానికి కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణం తొలత భావించినప్పటికీ... అది కాదని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. ఈ ఘటనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు హెలికాప్టర్‌లో డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ సోమవారం మధ్యాహ్నం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దాదాపు మూడు గంటల పాటు పరిశీలించారు. చివరకు ఇది ప్రమాదం కాదని... ఉద్దేశ్యపూర్వకంగా జరిగిన సంఘటనగా తేల్చారు. అయితే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన భూముల వ్యవహారాలతో ముడిపడిన ఫైళ్లు అక్కడే ఉండటం... అత్యంత కీలకమైన నిషేధిత భూముల జాబితా సెక్షన్‌లోనే మంటలు వ్యాపించడం అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఫైళ్ల దగ్ధంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ ఘటనపై మినిట్ టు మినిట్ ఏం జరిగిందో చెప్పాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా ఈ ఘటనపై ఒక్కరోజులోనే మూడు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. స్వయంగా కలెక్టర్‌తో మాట్లాడి అగ్నిప్రమాదంపై ఆరా తీశారు.

# వరుసగా ఏడోసారి బడ్జెట్.. నిర్మలమ్మ రికార్డు

దిల్లీ: పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. వరుసగా ఏడోసారి పద్దును ప్రవేశపెట్టి ప్రసంగించారు. నిర్మలా సీతారామన్ 2019 మే 30 నుంచి ఆర్థికమంత్రిగా కొనసాగుతున్నారు. అదే ఏడాది మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక ఆమె తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. తర్వాత వరుసగా 2020-21, 2021-22, 2022-23, 2023-24 బడ్జెట్‌లు అందించారు. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో ఫిబ్రవరి 1న 2024-25కి సంబంధించిన ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టారు. ఇప్పుడు పూర్తిస్థాయి బడ్జెట్‌ను (%దీబఒన్త్రవ్% 2024) ప్రవేశపెట్టారు. ఇప్పటివరకు వరుసగా ఆరుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రిగా మొరార్జీ దేశాయ్ పేరు మీదున్న రికార్డును నిర్మల చెరిపేశారు. 1959 - 1964 మధ్య దేశాయ్ ఐదు పూర్తిస్థాయి, ఒక తాత్కాలిక బడ్జెట్‌ను సభ ముందుంచారు.

**గంటా 22 నిమిషాలపాటు మంత్రి ప్రసంగం :** ఈసారి ఒక గంటా 22 నిమిషాల పాటు నిర్మలా సీతారామన్ ప్రసంగించారు. 2020 ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ రెండు గంటల 40 నిమిషాలు ఆమె ప్రసంగించారు. ఇప్పటి వరకు ఇదే సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం. రెండు పేజీలు మిగిలి ఉండగానే ఆమె తన స్పీచ్‌ను ముగించడం గమనార్హం. 1977లో తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెడుతూ అప్పటి మంత్రి హీరూభాయ్ ముల్జీభాయ్ పటేల్ కేవలం 800 పదాలను మాత్రమే చదివి వినిపించారు. ఇప్పటి వరకు ఇదే అతిచిన్న బడ్జెట్ ప్రసంగం.

గరుడ వార్త






# పిక్ టాక్ : అవ్నీత్ అందాల క్లీవేజ్ షో

జీ టీవీ డాన్స్ షో తో 2010 లో కెరీర్ ను ప్రారంభించిన నటి అవ్నీత్ కౌర్ పలు సినిమాలు మరియు సిరీస్ ల్లో నటించడం ద్వారా ఉత్తరాది ప్రేక్షకులకు చేరువ అయ్యింది. మర్దానీ, చంద్ర నందిని, అల్లాద్దీన్ - నామ్ తో సునా హెూగా, టికు వెడ్స్ షెరు చిత్రాల్లో నటించి మెప్పించింది. బుల్లి తెర మరియు వెండి తెరపై తనదైన ముద్ర వేసిన ఈ అమ్మడు సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్ గా అందాల ప్రదర్శన చేస్తున్న విషయం తెల్సిందే. నెట్టింట ఈమె ఫోటోలు





మరోసారి వైరల్ అవుతున్నాయి. అందాల అవ్నీత్ కౌర్ అందాల షో కి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. క్లీవేజ్ షో తో మతి పోగొట్టే విధంగా స్టైలిష్ అందాల అవ్నీత్ కౌర్ పిక్స్ కి నెటిజన్స్ చూపు తిప్పుకోలేక పోతున్నారు. ఈ స్థాయి అందాల ఆరబోత చేస్తున్నా, ఇంతటి అందగత్తె అయినా కూడా దక్కాల్సిన స్థాయిలో గుర్తింపు దక్కలేదు పాపం అంటూ చాలా మంది ఈ ఫోటోలకు కామెంట్స్ చేస్తున్నారు. నటిగా చేసిన సినిమాలు కొన్నే అయినా కూడా చెరగని ముద్ర ఈ అమ్మడు వేసింది అనడంలో సందేహం లేదు. నటిగా ముందు ముందు ఈ అమ్మడు చాలా సినిమాలు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ప్రస్తుతం ఒకటి రెండు సినిమాలకు కమిట్‌మెంట్ ఇచ్చిన ఈ అమ్మడు త్వరలో కొత్త సినిమాను షురూ చేసే అవకాశాలు ఉన్నాయి.

# సమంతతో ఆ భామ ఫైటింగులా?

సమంత మళ్లీ బిజీ అయ్యే ప్రయత్నాల్లో ఉన్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఆదిత్యారాయ్ కపూర్ తో వెబ్ సిరీస్ లో నటించడానికి రెడీ అవుతోంది. యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో ఈ సిరీస్ ని 'తుంబాడ్' ఫేం రాహి అనీల్ బర్వే దర్శకత్వం వహిస్తున్నారు. రాజ్ అండ్ డీకే ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సిరీస్ తో ప్రేక్షకుల్ని ఓ కొత్త వరల్డ్ లోకి తీసుకెళ్లబోతున్నారుట. ఇప్పటి వరకూ వచ్చిన వెబ్ సిరీస్ లకు పూర్తి భిన్నంగా ఉంటుందని సమాచారం. ఇందులో సమంత భారీ యాక్షన్ సన్నివేశాల్లో కనిపించనుందని ఇప్పటికే లీకైంది. ఆ పాత్ర వర్కౌట్ అయితే సమంత ఇమేజ్ కూడా మారిపోతుందని యూనిట్ వర్గాలు



ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా మరో ఇంట్రెస్టింగ్ అప్ డేట్ అందింది. ఇందులో సమంతకు పోటీగా, ఆమెని ఢీకొట్టే పాత్ర కోసం వామికా గబ్బిని ఎంపిక చేసారుట. ఇద్దరి మధ్య వచ్చే యాక్షన్ సన్నివేశాలు సిరీస్ కి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అంటున్నారు. అదే జరిగితే సమంత రేంజ్ రెట్టింపు అవుతుంది. ఇంతవరకూ సమంత యాక్షన్ నేపథ్యంతో కూడిన సినిమాలుగానీ, వెబ్ సిరీస్ గానీ చేయలేదు. ఇండియన్ వెర్షన్ 'సీటాడెల్' లో నటించింది.
కానీ అది ఇంకా రిలీజ్ అవ్వలేదు. అందులో ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అన్న ఎగ్జైట్ మెంట్ అభిమానుల్లో కనిపిస్తుంది. ఇంతలో మరో వెబ్ సిరీస్ లో ఆసక్తికర పాత్రతో సామ్ పేరు మోతెక్కుతోంది. ఈ వెబ్ సిరీస్ కి ఇంట్రెస్టింగ్ టైటిల్ పరిశీలనలో ఉంది. ఆ టైటిల్ 'రక్తబ్రహ్మాండ్'. టైటిల్ యూనిక్ గా ఉంది. ఎన్ని భాషల్లోనైనా ఇదే టైటిల్ తో రిలీజ్ చేయొచ్చు. అలాగే సమంత బాలీవుడ్ లో సినిమాలు చేయడానికి గట్టి ప్రయత్నాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. అమెరికా నుంచి తిరిగొచ్చిన తర్వాత ఆ పనుల్లోనే బిజీ అయింది. ఆమె నుంచి సినిమా ప్రకటన ఎప్పుడొస్తుందా? అని అభిమానులంతా ఎదురు చూస్తున్నారు.

# బాలయ్య మళ్లీ సంక్రాంతి ట్రీట్..!




సీనియర్ హీరోల్లో వరుస సూపర్ హిట్లతో సూపర్ ఫాం లో ఉన్న డైరెక్టర్ బాలకృష్ణ ప్రస్తుతం కె ఎస్ బాబీ డైరెక్షన్ లో ఒక ప్రాజెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. సితార, ఫార్చ్యూన్ ఫోర్ మూవీస్ కలిసి చేస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో శ్రద్ధ శ్రీనాథ్, ఊర్వశి రౌతెలా హీరోయిన్స్ గా నటిస్తున్నారు. సినిమా దాదాపు పూర్తి కావొచ్చిందని తెలుస్తుండగా రిలీజ్ డేట్ ఎప్పుడన్నది ఇంకా వెల్లడించలేదు.

ఈమధ్య స్టార్ సినిమాలు రిలీజ్ డేట్ అనౌన్స్ చేసి తీరా టైం దగ్గర పడుతున్న తరుణంలో రిలీజ్ వాయిదా వేస్తున్నారు. ఇప్పటికే ఈ ఇయర్ రాబోయే చాలా సినిమాలు రిలీజ్ పోస్ట్ పోన్ చేసుకున్నాయి. ఐతే బాలయ్య సినిమా అలా కాకుండా ఒక పర్ఫెక్ట్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. బాలకృష్ణ కె ఎస్ బాబీ కాంబినేషన్ మొదటిసారి కలిసి చేస్తున్న సినిమాగా ఇది నందమూరి ఫ్యాన్స్ కే కాదు మాస్ ఆడియన్స్ కు మంచి ట్రీట్ అందిస్తుందని అంటున్నారు. మెగాస్టార్ చిరంజీవితో వాల్తేరు వీరయ్య సినిమా చేసిన బాబీ బాలకృష్ణతో కూడా మరో హిట్ కొట్టాలని చూస్తున్నాడు. ఈ సినిమాకు వీర మాస్ అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ఐతే ఈ సినిమాను ముందు డిసెంబర్ రేసులో దించాలని అనుకున్నారు. సినిమా ముందే పూర్తైతే దసరాకి రిలీజ్ ప్లాన్ చేయాలని ఫిక్స్ అయ్యారు. కానీ ఏపీలో ఎలక్షన్స్ వల్ల అది కుదరలేదు. అందుకే సినిమాను డిసెంబర్ లో తీసుకు రావాలని అనుకున్నారు. కానీ ఇప్పుడు డిసెంబర్ లో కూడా రిలీజ్ లు ఎక్కువ అవ్వడం వల్ల ఏకంగా సంక్రాంతికి వచ్చేలా ప్లాన్ చేస్తున్నారట. సంక్రాంతికి ఇప్పటివరకైతే చిరు విశ్వంభర అనౌన్స్ చేశారు. రవితేజ సినిమా కూడా ఒకటి రిలీజ్ ఉంటుందని తెలుస్తుంది. ప్రభాస్ రాజా సాబ్ కూడా పొంగల్ రేసులో ఉండే ఛాన్స్ ఉంది. వీటితో పాటుగా బాలయ్య సినిమా కూడా ఉంటుందని అంటున్నారు.

సంక్రాంతికి వచ్చిన బాలకృష్ణ సినిమాలు దాదాపు అన్నీ సూపర్ హిట్ అయ్యాయి. లాస్ట్ ఇయర్ కూడా వీర సింహా రెడ్డి వచ్చింది. ఐతే ఈ ఇయర్ సంక్రాంతి వదిలేసిన బాలయ్య నెక్స్ట్ పొంగల్ కి మాత్రం వీర మాస్ తో రావాలని చూస్తున్నాడు. బాలయ్య సినిమా సంక్రాంతికి వస్తే మిగతా సినిమాల రిలీజ్ ల విషయంలో మరోసారి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పొచ్చు.

# మెకానిక్ రాకీ కోసం స్టైలిష్ పాప




యువ హీరో విశ్వక్ సేన్ తన తదుపరి చిత్రం 'మెకానిక్ రాకీ'తో దీపావళి రేసులో ఉన్నాడు. ఈ మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ అక్టోబర్ 31న థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రానికి రవితేజ ముల్లపూడి దర్శకత్వం వహించగా, ప్రముఖ నిర్మాత రామ్ తల్లూరి SRT ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మించారు. ఇప్పటికే విశ్వక్ సేన్ డిఫరెంట్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద మంచి రిజల్ట్ అందుకుంటూ ఉన్నాడు. ఇక ఇప్పుడు ఈ సినిమాపై కూడా ఆసక్తి పెరుగుతోంది. అయితే ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి మరియు శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

ఈ చిత్రం ఒక ట్రయాంగిల్ ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక శ్రద్ధా శ్రీనాథ్ కు వెల్కమ్ చెప్పే మూమెంట్ మరింత ప్రత్యేకంగా మార్చడంలో భాగంగా, మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఆమె స్లిట్ మాక్సీ డ్రెస్‌లో అందంగా కనిపిస్తున్నారు. ఆమె ముఖం మీద చిరునవ్వుతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 'మెకానిక్ రాకీ' సినిమా భారీ బడ్జెట్‌తో, పెద్ద కాన్వాస్‌పై నిర్మించబడింది. ఈ చిత్రంలో ప్రతిష్టాత్మక టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. జేక్స్ బెజోయ్ సంగీతం సమకూర్చగా, మనోజ్ కటసాని సినిమాటోగ్రఫీ నిర్వహించారు. అన్వర్ అలీ ఎడిటర్‌గా, క్రాంతి ప్రియం ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. సత్యం రాజేష్ మరియు విద్యా సాగర్ జె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లుగా ఉన్నారు. ఈ సినిమాలో విశ్వక్ సేన్ మెకానిక్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ పాత్ర ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. శ్రద్ధా శ్రీనాథ్ మరియు మీనాక్షి చౌదరి మధ్య ఉండే కెమిస్ట్రీ, సినిమా కథకు మరింత ఉత్కంఠతను కలిగిస్తుందని మేకర్స్ తెలియజేశారు. ఈ కథలో కమెడీ, యాక్షన్ సరికొత్తగా ఉంటాయని దీంతో ప్రేక్షకులను పూర్తిగా ఎంటర్‌టైన్ అవుతారని అని తెలిపారు. శ్రద్ధా శ్రీనాథ్ ఇప్పటికే తన నటనతో తెలుగు ప్రేక్షకులకు ఎంతగానో దగ్గరైంది. ఈ చిత్రంలో ఆమె పాత్రకు మంచి ప్రాధాన్యత ఉన్నట్లు తెలుస్తోంది. విశ్వక్ సేన్, మీనాక్షి చౌదరి, మరియు శ్రద్ధా శ్రీనాథ్ మధ్య కెమిస్ట్రీ సినిమా ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని కలిగించేలా ఉండనుంది.

ఇప్పటికే విడుదలైన పోస్టర్స్ ప్రేక్షకులలో మంచి అంచనాలను సృష్టించింది. దీపావళి కానుకగా విడుదలవుతున్న ఈ చిత్రం, ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేందుకు సిద్ధంగా ఉంది. సినిమాటోగ్రఫీ, సంగీతం, మరియు ఇతర సాంకేతిక విభాగాలు సినిమా స్థాయిని పెంచేలా ఉంటాయని అర్థమవుతుంది. ఇప్పటివరకు వచ్చిన సమాచారం ప్రకారం, 'మెకానిక్ రాకీ' సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చే అవకాశం ఉంది. ఈ దీపావళి సీజన్‌లో ప్రేక్షకులకు మోస్ట్ అవైటెడ్ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందని భావిస్తున్నారు.

# లేడీ సూపర్ స్టార్ ప్రయోగాల్లో తగ్గేదేలే!

భారీ స్టార్ డమ్ ఉన్నవారంతా కొత్త వాళ్లతో ప్రయోగాలు చేయాలంటే చాలా విషయాలు ఆలోచిస్తారు. అతడి సామర్థ్యం ఎంత? నమ్మి అవకాశం ఇస్తే చేయగలడా? లేదా? అంచనాలు అందుకోకపోయినా నాట్ సో బ్యాడ్ అయినా అనిపించగలడా? అని ఇలా వంద రకాలుగా ఆలోచిస్తారు. స్టార్ డమ్ తో పాటు నిర్మాత కోట్ల రూపాల వ్యయం ముడి పడి ఉంటుంది కాబట్టి ఇవన్నీ ఆలోచించడం సహజం. కొన్నిసార్లు ఆప్రయోగాలు సక్సెస్ అవుతుంటాయి. మరికొన్నిసార్లు ఫెయిలవుతుంటాయి. ఎవరైనా నమ్మే సినిమాలు చేస్తారు. కానీ అన్నిసార్లు అంచనాలు అందుకోవడం కష్టం. ఈ విషయంలో మాత్రం లేడీ సూపర్ స్టార్ నయనతారని మెచ్చుకోవాల్సిందే. మార్కెట్ లో నయన్ స్టార్ డమ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. సౌత్ లోనే నెంబర్ వన్ హీరోయిన్ గా కొనసాగుతుంది.



కమర్షియల్ సినిమాలకు అత్యధిక పారితోషికం తీసుకుంటోన్న హీరోయిన్ కూడా ఆమెనే. %-%జవాన్%-% విజయంతో పాన్ ఇండియాలోనూ ఫేమస్ అయిన సంగతి తెలిసిందే. హిందీ, తెలుగులో అవకాశాలు వస్తున్నా? కమిట్ అవ్వని భామ కూడా. అయితే లేడీ ఓరియేంటెడ్ చిత్రాలపై ఉన్న మక్కువతో అమ్మడు కథ నచ్చిందంటే? వెనకా ముందు ఆలోచించకుండా కమిట్ అవుతుంది. వాళ్లు కొత్త దర్శకులా? కదా? పనిచేసిన అనుభవం ఉందా? లేదా? అనే విషయాలు పక్కనబెట్టి కథ నచ్చిందంటే ఒకే చెబుతుంది. ఈ మధ్య కాలంలో మూడు సినిమాలు అదే కోవలో కమిట్ అయింది. ఇలా కొత్త వాళ్లని ప్రోత్సహించడం తప్పు లేదు. నిజంగా ట్యాలెంట్ ఉంటే సక్సెస్ కొట్టి చూపిస్తారు. నయన్ పెట్టుకున్న నమ్మకం నిజమవుతంది. కానీ తేడా కొడితే అంతే విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాస్తవానికి నయనతారలే ఉమెన్ సెంట్రిక్ చిత్రాల ప్రయోగం చాలా కాలంగా చేస్తోంది. కానీ ఇంత వరకూ సాలిడ్ సక్సెస్ ఒక్కటీ లేదు. బాక్సాపీస్ వద్ద 100 కోట్ల హీరోయిన్ అని ప్రూవ్ చేసుకోవాలి అన్న కోణంలో చాలా ప్రయత్నాలు చేస్తోంది. కానీ ఆ ప్రయత్నమే ఫలించడం లేదు. మరి న్యూ మేకర్స్ అమ్మడి డ్రీమ్ ని నెరవేరుస్తారేమో చూడాలి.

# ఆ పిలుపే ఉపాసనకు అదిరిపోయే గిఫ్ట్

ఏ తండ్రికి అయినా కూతురు అంటే వల్లమాలిన ప్రేమ. క్లిన్ కారాపై రామ్ చరణ్‌కి ఉన్న ప్రేమ అంతకుమించి. ఏడాది వయసున్న క్లిన్ కారా అసలు డాడీ రామ్ చరణ్ ని వదిలి ఉండలేదు. మమ్మీ కంటే డాడీకి బాగా చేరువైందని గుసగుసలు వినిపించాయి. ఇక క్లిన్ కారాను వదిలి చరణ్ క్షణమైనా ఉండలేడు. కూతురితో ప్రతిక్షణం ఆటపాటలను ఆస్వాధిస్తాడు చరణ్. అయితే కూతురిపై ప్రేమకు కారణం భార్య ఉపాసన. అందుకేనేమో నేడు బర్త్‌డే జరుపుకుంటున్న ఉపాసనను కారా మమ్మీ అంటూ పిలిచేసాడు చరణ్. భార్యపై ఎంతటి ప్రేమాభిమానం.. అలా కాకపోతే కూతురి పేరుతో పిలిచేస్తాడా? చరణ్ ఉపాసన పుట్టినరోజు సందర్భంగా విష్ చేస్తూ హ్యాపీ బర్త్ డే కారా మమ్మీ!! అంటూ పోస్ట్ చేశాడు. క్లిన్ కారా చరణ్- ఉపాసనల గారాల కుమార్తె అని అందరికీ తెలుసు. గారాల పట్టీ



20 జూన్ 2023న జన్మించింది. ఇప్పటికే ఒక సంవత్సరం నిండింది. దంపతులు ఇద్దరూ ఎక్కడికి వెళ్లినా తమ వెంటే క్లిన్ కారా కూడా ఉంటోంది. ప్రస్తుతం లండన్ వెకేషన్ లోను చరణ్-ఉపాసనతోనే క్లిన్ కారా ఉంది. ఆగస్టులో జరిగే ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్‌లో చరణ్‌కి అంబాసిడర్ ఫర్ ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ టైటిల్‌ను అందజేయనున్నారు. ఇదే హుషారులో తన తదుపరి చిత్రం గేమ్ ఛేంజర్ ని పాన్ ఇండియాలో బ్లాక్ బస్టర్ గా మలచాలని చరణ్ తపిస్తున్నాడు. ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది చివరిలో ఈ సినిమా విడుదల అయ్యేందుకు అవకాశం ఉంది. రిలీజ్ తేదీని ఇంకా ప్రకటించాల్సి ఉంది.




లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రధాని మోదీ స్పందించారు. మధ్యతరగతి ప్రజలకు భరోసా ఇచ్చే బడ్జెట్ ఇదని కొనియాడారు. దళితులు, అణగారిన వర్గాలకు శక్తినిచ్చే బడ్జెట్ అని పేర్కొన్నారు. "మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేశాం. చిరు వ్యాపారులు, ఎంఎస్ఎంఈల అభివృద్ధికి కొత్త బాటలు వేశాం. మౌలిక, తయారీ రంగాలను బలోపేతం చేసేలా ఈ బడ్జెట్ ఉంది. దేశ ఆర్థికాభివృద్ధికి ఈ బడ్జెట్ దోహదం చేస్తుంది. ఉద్యోగ కల్పన, స్వయం ఉపాధికి ప్రాధాన్యత ఇచ్చాం. ఎంప్లాయిమెంట్ లింక్‌డ్ స్కీమ్ ద్వారా కొత్త ఉద్యోగాల కల్పన జరుగుతుంది. కొత్త ఉద్యోగులకు తొలి జీతం మా ప్రభుత్వమే ఇస్తుంది. కోటి మందికి ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నాం. ఇంటర్న్‌షిప్ ద్వారా గ్రామీణులకూ పెద్ద కంపెనీల్లో పనిచేసే అవకాశం ఉంటుంది"

**యువతరం కలలు నెరవేర్చే బడ్జెట్ :** బడ్జెట్‌లో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేశాం. యువతరం కలలు నెరవేర్చే బడ్జెట్ ఇది. గ్రామం నుంచి మహా నగరం వరకు అందర్నీ వ్యాపారవేత్తలను చేయడమే మా లక్ష్యం. ముద్రా రుణాల పరిధిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు పెంచాం. భారత్‌ను గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చుతున్నాం. ఎంఎస్ఎంఈలకు రుణాలు అందించేందుకు కొత్త పథకం తీసుకొస్తున్నాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.




## బ్రెజిల్ తీరంలో కొకైన్ షార్కులు.. మాదక ద్రవ్యాలతో కలుషితమైన సముద్రం..!

మాదక ద్రవ్యాలు మనుషులకే కాదు.. మూగజీవాలకు కూడా ప్రాణాంతకంగా మారుతున్నాయి. బ్రెజిల్ తీరంలోని కొన్నిరకాల చేపల్లో భారీ ఎత్తున మాదక ద్రవ్యాల ఆనవాళ్లను శాస్త్రవేత్తలు గుర్తించారు. స్మగ్లర్లు ఫ్లోరిడా, దక్షిణ, మధ్య అమెరికా తీరాలకు మాదక ద్రవ్యాలను చేరవేయడానికి సముద్ర మార్గాన్ని ఎన్నుకొన్నారు. దీంతో వారు టన్నుల కొద్దీ కొకైన్ ప్యాకెట్లను సముద్రంలో వేస్తుండటంతో.. వాటి ప్రభావానికి ఈ చేపలు గురై ఉంటాయని భావిస్తున్నారు. బ్రెజిల్‌లోని ఒస్వాల్డో క్రూజ్ ఫౌండేషన్ ఇటీవల ఒక పరిశోధన చేసింది. మాదక ద్రవ్యాల కారణంగా సముద్రం కలుషితమైతే.. అవి షార్క్ చేపలపై ఏమేరకు ప్రభావం చూపిస్తాయనే అంశంపై అధ్యయనం నిర్వహించింది. ఈక్రమంలో శాస్త్రవేత్తలు 13 వైల్డ్ బ్రెజిలియన్ షార్ప్‌నోస్ షార్క్‌లను చిన్న పడవల నుంచి కొనుగోలు చేశారు. ఆ చేపలు జీవితం మొత్తం బ్రెజిల్ తీరంలోనే గడుపుతాయి. దీంతో వాటి కండరాలు, కాలేయంపై లిక్విడ్ క్రొమాటోగ్రఫీ అనే పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షల్లో 13 చేపల్లో కొకైన్ ఆనవాళ్లు ఉన్నట్లు తేలింది. అది కూడా గతంలో ఇతర ఆక్వాటిక్ సెంటర్లలో పరీక్షించిన వాటికంటే అధికంగా ఉన్నట్లు గుర్తించారు. తొలిసారి సముద్రంలో స్వేచ్ఛగా తిరిగే షార్క్ శరీరాల్లో కొకైన్ ఆనవాళ్లు గుర్తించిన అధ్యయనం ఇదే. వాటి లివర్‌లో కంటే.. కండరాల్లో అత్యధికంగా మాదక ద్రవ్యాల ఆనవాళ్లున్నాయి. ఇక మాదక ద్రవ్యాల కారణంగా ఆ ప్రాణుల ప్రవర్తనలో ఏమైనా మార్పులు వస్తున్నాయా అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉంది. అమెరికా ఖండం సముద్ర జలాల్లో టన్నుల కొద్దీ కొకైన్‌ను అధికారులు ఏటా స్వాధీనం చేసుకొంటూనే ఉంటారు. అయినా.. అంతకుమించి కొకైన్ ఆయా దేశాల తీరాలకు చేరుకొంటూనే ఉంటుంది. అమెరికా కోస్టుగార్డ్ గతేడాది 6,400 కేజీల కొకైన్‌ను కరేబియన్-అట్లాంటిక్ జలాల్లో స్వాధీనం చేసుకొంది. దీని విలువ 182 మిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా.




## నెల వేతనం, రూ.3వేల పీఎఫ్ రీయింబర్స్.. ఉద్యోగ కల్పనే లక్ష్యంగా 'పీఎం ప్యాకేజీ'

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించింది. ఎన్నికల వేళ నిరుద్యోగం, విద్య-ఉపాధి మధ్య అంతరాల వంటి అంశాల్లో విమర్శలు వెల్లువెత్తిన వేళ ఈ రంగానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. ఉద్యోగాల సృష్టిని ప్రోత్సహించేందుకుగానూ యాజమాన్యాలకూ ఉపశమనాలు ప్రకటించింది. వేతనం సహా ఈపీఎఫ్ఓ చందా ద్వారా వీటిని అందించేందుకు సిద్ధమైంది. ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'ప్రధానమంత్రి ప్యాకేజీ' కింద మూడు కొత్త పథకాలను ప్రవేశపెట్టారు.

**3 వాయిదాల్లో ఒక నెల వేతనం..** తొలిసారి ఉద్యోగంలో చేరేవారికి ఒక నెల వేతనం అందిస్తామని సీతారామన్ తెలిపారు. సంఘటిత రంగంలోని అన్ని సెక్టార్లకు దీన్ని వర్తింపజేస్తామన్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ పథకం కింద మూడు వాయిదాల్లో చెల్లిస్తామన్నారు. గరిష్ఠంగా రూ. 15 వేల వరకు అందజేయనున్నారు. దాదాపు 210 లక్షల మందికి దీని ద్వారా ప్రయోజనం చేకూరే అవకాశం ఉన్నట్లు మంత్రి తెలిపారు.

**తయారీ రంగంలో ఉద్యోగాలు..** తయారీ రంగంలో అదనపు ఉపాధి కల్పనే లక్ష్యంగా రెండో పథకాన్ని తీసుకొచ్చారు. తొలిసారి ఉద్యోగులతో పాటు ఉద్యోగాలు కల్పించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఉద్యోగుల భవిష్యనిధి కంట్రిబ్యూషన్ ద్వారా దీన్ని అందజేయనున్నారు. ఉద్యోగం కల్పించిన నాటినుంచి నాలుగేళ్ల వరకు ఈ ప్రోత్సాహకాలు అందుతాయన్నారు. దాదాపు 30 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. గరిష్ఠంగా రూ.లక్ష వేతనం ఉన్నవారికి దీన్ని వర్తింపజేస్తామన్నారు.

**రూ.3 వేల పీఎఫ్ రీయింబర్స్..** అదనంగా ఉద్యోగాలు కల్పించిన యాజమాన్యాలకు రెండేళ్ల పాటు రూ.3,000 వరకు ఈపీఎఫ్ఓ కంట్రిబ్యూషన్‌ను రీయంబర్స్ చేస్తామని మంత్రి తెలిపారు. ఈ పథకం వల్ల 50 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా వేశారు.

**మహిళా ఉద్యోగులకు హాస్టళ్లు..** పరిశ్రమల సహకారంతో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక హాస్టళ్లు, శిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని నిర్మలమ్మ ప్రకటించారు. తద్వారా ఉద్యోగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే పరిశ్రమల భాగస్వామ్యంతో మహిళల కోసం ప్రత్యేక నైపుణ్య కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

**నైపుణ్య కార్యక్రమాలు.. 20 లక్షల మందికి శిక్షణ..** రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమల సహకారంతో నైపుణ్య శిక్షణ కోసం ప్రధానమంత్రి ప్యాకేజీ కింద నాలుగో పథకాన్ని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఐదేళ్ల వ్యవధిలో 20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణనిస్తామన్నారు. 1,000 ఐటీఐలను హబ్ అండ్ స్పోక్ మోడల్ కింద ఉన్నతీకరిస్తామని వెల్లడించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు చేస్తామని తెలిపారు. కొత్త కోర్సులను కూడా ప్రవేశపెడతామని ప్రకటించారు.

**స్కిల్ లోన్స్..** మోడల్ స్కిల్ లోన్ కింద రూ. 7.5 లక్షల వరకు రుణాలకు ప్రభుత్వ ప్రయోజిత ఫండ్ ద్వారా పూచీకత్తు ఇస్తామని కేంద్రం తెలిపింది. దీని వల్ల ఏటా 25,000 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని ఆశాభావం వ్యక్తం చేసింది.

**విద్యా రుణాలకు సాయం..** ప్రభుత్వ పథకాలు, విధానాల ద్వారా ఎలాంటి ప్రయోజనం పొందని యువత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలను ప్రకటించింది. దేశీయ విద్యా సంస్థల్లో ఉన్నత విద్య కోసం తీసుకునే రూ. 10 లక్షల వరకు రుణాలకు ఆర్థిక సాయం అందజేయనుంది. దీని కింద ఏటా లక్ష మంది విద్యార్థులకు రుణ మొత్తంపై మూడు శాతం వడ్డీ రాయితీ ఇచ్చే ఈ-వోచర్లు అందజేస్తామని ప్రకటించింది.




దిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో పలు క్యాన్సర్ ఔషధాలు, మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ సుంకాన్ని భారీగా తగ్గిస్తున్నట్లు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీంతో రిటైల్ మార్కెట్‌లో వీటి ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. అలాగే, కేంద్రం నిర్ణయంతో బంగారం, వెండి, లెదర్ వస్తువులు, సీఫుడ్ చౌకగా లభించనున్నాయి. పలు వస్తువులపై ఎక్సైజ్ సుంకాన్ని పెంచడంతో వాటి ధరలు పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రిటైల్ మార్కెట్లో ధరలు తగ్గే, పెరిగే అవకాశం ఉన్న కొన్ని వస్తువుల్ని పరిశీలిస్తే..

**ధరలు తగ్గే వస్తువులివే..!..** మొబైల్ ఫోన్లు, మొబైల్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, ఛార్జర్లపై బేసిక్ కస్టమ్స్ తగ్గించడంతో వినియోగదారులకు స్మార్ట్‌ఫోన్ల ధరలు తగ్గే అవకాశం ఉంది. ఈ చర్యను మేడిన్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ రంగానికి శుభసూచికంగా పేర్కొంటున్నారు. గత ఆరేళ్లలో మొబైల్ ఫోన్ల దేశీయ ఉత్పత్తి, ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

**క్యాన్సర్ డ్రగ్స్:** మూడు క్యాన్సర్ ఔషధాలపై కస్టమ్స్ సుంకాన్ని మినహాయించారు. దీంతో ఆ ధరలు తగ్గే అవకాశం ఉంది.

**బంగారం, వెండి:** వీటిపై 6శాతం కస్టమ్స్ సుంకాన్ని తగ్గించారు. ఈ చర్యతో రిటైల్ డిమాండ్ పెరుగుతుందని, తద్వారా స్మగ్లింగ్‌ను అరికట్టడంలో దోహదపడుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ప్లాటినమ్‌పైనా 6.5% కస్టమ్స్ సుంకాన్ని తగ్గిస్తూ నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. బంగారం, వెండి, ప్లాటినమ్‌పై బేసిక్ కస్టమ్స్ సుంకం తగ్గించాలంటూ ఎప్పటినుంచో జెమ్స్ అండ్ జ్యువెలరీ పరిశ్రమ డిమాండ్ చేస్తోంది.

**సీ ఫుడ్:** రొయ్యలు, చేపల మేతపై బేసిక్ కస్టమ్స్ సుంకం 5%కి తగ్గించారు. తద్వారా వీటి ధరలు తగ్గే అవకాశం ఉంది.

**సోలార్ ఎనర్జీ భాగాలు:** సౌర విద్యుత్ సంబంధిత భాగాలపై సుంకాన్ని పొడిగించకూడదని కేంద్రం ప్రతిపాదించింది.

**ఫుట్‌వేర్:** లెదర్, ఫుట్‌వేర్‌పై కస్టమ్స్ సుంకం తగ్గించడంతో పాటు ఫెర్రోనికెల్, బ్లిస్టర్ కాపర్ వంటి మినరల్స్‌పై బేసిక్స్ కస్టమ్స్ సుంకాన్ని తగ్గిస్తూ ప్రతిపాదించారు.

**మరింత ప్రియం అయ్యే వస్తువులివే.. ! ... టెలికం పరికరాలు:** మదర్‌బోర్డులపై 5శాతం దిగుమతి సుంకాన్ని పెంచాలని కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. దీంతో ఆయా వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంది. అమ్మోనియం నైట్రేట్, నాన్ బయోడీగ్రేడబుల్ ప్లాస్టిక్‌పై కస్టమ్స్ సుంకాన్ని 10శాతానికి పెంచారు. దీంతో ఆయా వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంది.

## లాస్య నందితకు శాసనసభ సంతాపం.. సభ వాయిదా

హైదరాబాద్ : కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతిపట్ల శాసనసభ సంతాపం ప్రకటించింది. ఆమె మృతికి సంతాపంగా సభ్యులందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం సభను బుధవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. సభ ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగా, లాస్య నందిత మృతిపట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు.



ఈ సందర్భంగా లాస్య నందిత సేవలను, ఆమె తండ్రి సాయన్న సేవలను రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. అనంతరం శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సునీతా లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, రాజశేఖర్ రెడ్డి, కేపీ వివేకానంద్ గౌడ్, కూనంనేని సాంబశివరావు, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, శ్రీ గణేశ్.. లాస్య నందిత మృతిపట్ల సంతాపం ప్రకటిస్తూ సీఎం రేవంత్ తీర్మానాన్ని బలపరిచారు.

## అసెంబ్లీలో కేసీఆర్ ఛాంబర్‌పై కేటీఆర్ అసంతృప్తి

హైదరాబాద్, జూలై 23: అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కేటాయించిన ఛాంబర్‌పై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సమావేశాల సందర్భంగా ఇన్నర్ లాబీలోని ఎల్‌వోపీ కార్యాలయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తొలగించిన విషయం తెలిసిందే. ఔటర్ లాబీలో ఎల్‌వోపీకి ఛాంబర్ ఏర్పాటు చేశారు. రెండు రూమ్‌లు కలిపి ఒకే రూంగా అసెంబ్లీ సిబ్బంది మార్చేశారు. అయితే రూం మధ్యలో టాయిలెట్ పెట్టి వాడుకోవడానికి అనుకూలంగా లేకుండా చేశారని కేటీఆర్ మండిపడ్డారు. ఈ అంశాన్ని బీఏసీలో లేవనెత్తాలని మాజీ మంత్రి హరీష్‌రావుకు కేటీఆర్ సూచించారు. స్పీకర్‌ను కలిసి అభ్యంతరం వ్యక్తం చేయాలని కేటీఆర్ నిర్ణయించారు. కాగా... అసెంబ్లీకి చేరుకునే ముందు గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద కేటీఆర్ నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి అసెంబ్లీకి చేరుకున్నారు. అయితే అసెంబ్లీ సమావేశాల్లో ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. అలాగే ఈ బడ్జెట్ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ హాజరుకానున్నారు. సభలో బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు అసెంబ్లీకి హాజరుకావాలని కేసీఆర్ నిర్ణయించారు. కేవలం ఒక్కరోజు మాత్రమే కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యే అవకాశం ఉంది. అలాగే బీజేపీ నేతలు కూడా గన్‌పార్క్ వద్ద అమర వీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. బీజేపీ ఎమ్మెల్యేలు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులు అర్పించారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వం నశించాలని, రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నశించాలని బీజేపీ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు.

## లాస్య నందిత భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని ఆశించాం.. భావోద్వేగానికి లోనైన కేటీఆర్

హైదరాబాద్ : కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతిపట్ల శాసనసభ సంతాపం ప్రకటిస్తూ సీఎం రేవంత్ రెడ్డి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. లాస్య నందిత భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని ఆశించాం.. కానీ ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికైన కొద్ది రోజులకే మరణించడం బాధాకరమని కేటీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. ఓ యువ శాసనసభ్యురాలు అనుకోని పరిస్థితిలుల్లో మరణించారు. కొన్ని సందర్భాలు దిగ్భ్రాంతినిక కలిగిస్తాయి. 5 సార్లు గెలుపొందిన సీనియర్ ఎమ్మెల్యే సాయన్న మృదు స్వభావి. ఆయన అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్నారు. కేసీఆర్ నాయకత్వంలో సాయన్న కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి చేశారు. సాయన్న, ముఠా గోపాల్ చిరకాల స్నేహితులు.. వారిద్దరి మధ్య దశాబ్దకాలంగా స్నేహం ఉంది. 2015లో జీహెచ్ఎంసీ ఎన్నికలు వచ్చినప్పుడు కవాడిగూడ నుంచి లాస్య నందితను కార్పొరేటర్‌గా చూడాలని ఉందని కేసీఆర్‌ను సాయన్న కోరారు. కేసీఆర్ కాదనకుండా.. ఆమెకు అవకాశం ఇచ్చారు. లాస్య నందిత కూడా గెలుపొందారని కేటీఆర్ గుర్తు చేశారు. సాయన్న కుటుంబాన్ని చూస్తుంటే విధి పగబట్టిందేమో అన్న విధంగా ఉంది. సాయన్న, లాస్య నందిత ఒకే ఏడాదిలో దుర్మరణం చెందారు. ఇవి ఆవేదన కలిగించే అంశాలు. ఆ కుటుంబంలో ఎంతో విషాదం నెలకొంది. నందిత చలా చురుకైన అమ్మాయి. సాయన్న ఆరోగ్యం బాగాలేనప్పుడు.. ఇద్దరు కుమార్తెలు నందిత, లాస్య నివేదిత ఆయనతో ఎల్లవేళలా ఉండేవారు. ఇద్దరు అమ్మాయిలు కుడి ఎడమ భుజం మాదిరిగా ఉండేవారని పేర్కొన్నారు కేటీఆర్. ఇదే శాసనసభలో కేసీఆర్ సీఎంగా సాయన్న సంతాప తీర్మానం ప్రవేశపెట్టడమే కాకుండా ఆ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. 2018 ఎన్నికల్లో లాస్య నందితకు టికెట్ ఇచ్చి




ఎమ్మెల్యేగా గెలిపించుకున్నాం. నందిత తన తండ్రి ఆశీస్సులతో మంచి మెజార్టీతో గెలిచింది. గెలుపొందిన కొద్ది కాలానికే నల్లగొండలో మా పార్టీ సభ జరిగితే వచ్చింది. ఆ రోజు ఆమె స్వల్ప గాయాలతో బయట పడింది. కారు ధ్వంసమైంది. ఆ తర్వాత లిఫ్ట్‌లో ఆమె ప్రమాదానికి గురైంది. ఆ తర్వాత కొద్ది రోజులకు ఔటర్ రింగ్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో నందిత మరణించిందని కేటీఆర్ తెలిపారు. లాస్య నందిత మరణిస్తే తిరిగి వారి సోదరి నివేదితకు ఉప ఎన్నికల్లో అవకాశం ఇచ్చాం. దురదృష్టావశాత్తు ఆమె ఓటమి పాలైంది. మంచి విద్యార్హతలు కలిగిన లాస్య నందిత ఈ సభలో అడుగపెట్టిందని సంతోషించాం. భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని ఆశించాం. ఆమెకు సంతాపంగా మాట్లాడాల్సి వస్తుందని ఎవరూ ఊహించలేదు. సాయన్న కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చాం.. భవిష్యత్‌లో కూడా సంపూర్ణంగా అండగా ఉంటాం. ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## పోలీసులు సివిల్ వివాదాలకు దూరంగా ఉండాలి.. : రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ: సివిల్ వివాదాలకు పోలీసులు దూరంగా ఉండాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు సూచించారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్‌లో నిర్వహించిన డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ల ప్రత్యేక సమీక్ష సమావేశంలో సీపీ మాట్లాడారు. నేరాల నియంత్రణ, నేరస్థులను పట్టుకోవడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని, సీసీటీవీ ఫుటేజీలను వినియోగించుకోవాలన్నారు.

పాత నేరస్థుల కదలికపై నిఘా ఉంచాలని, స్టేషన్‌కొచ్చే వారితో మర్యాదతో మసలుకోవాలని హితవుపలికారు. మహిళలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా ఉండాలని.. డ్రగ్స్ సరఫరా, విక్రయంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. డీసీపీలు రాజే చంద్ర, ప్రవీణ్ కుమార్, కరుణాకర్, అరవింద్ బాబు, సునీతారెడ్డి, ఉషా విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**గసగసాల పౌడర్, ఎండీఎంఏ విక్రేతల అరెస్ట్ :** బస్సులు, లారీలు, రైళ్ల ద్వారా నగరానికి మత్తు పదార్థాలు తరలించి విక్రయిస్తున్న ఇద్దరిని ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ, జవహర్‌నగర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఎస్‌వోటీ డీసీపీ మురళీధర్‌తో కలిసి కేసు వివరాలను సీపీ వెల్లడించారు. రాజస్థాన్ జోథ్‌పూర్‌కు చెందిన పెయింటర్ ఓమా రామ్ అలియాస్ ఓం ప్రకాష్ (35) నల్లమందు, పాపిస్ట్రా పౌడర్ విక్రయించేవాడు. అదే రాష్ట్రానికి చెందిన సన్వాలరామ్ (33) చందానగర్‌లో ఉంటూ రోలింగ్ షట్టర్ల కార్మికుడిగా పనిచేస్తున్నాడు,.

ఇద్దరూ కలిసి సులభంగా డబ్బులు సంపాదించే లక్ష్యంతో డ్రగ్స్ వ్యాపారి వికాస్ అలియాస్ ముఖేష్ నుంచి పాపిస్ట్రా పౌడర్, ఎండీఎంఏ కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. నిఘా ఉంచిన పోలీసులు.. జవహర్‌నగర్ పరిధిలోని తిమ్మాయిపల్లి శివారులో డ్రగ్స్ తరలిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40 కిలోల పాపిస్ట్రా పౌడర్ (గసగసాల పొడి), 10 గ్రాముల ఎండీఎంఏ, 3 మొబైల్ ఫోన్లు, రూ. 10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సరఫరాదారుడు వికాస్ పరారీలో ఉన్నాడు

## హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు: కేంద్ర ఆర్థిక మంత్రి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లోని అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాస్తామని చెప్పారు. అదేవిధంగా విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం అందిస్తామన్నారు. ఓర్వకల్లు, కొప్పర్తి ప్రారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. అయితే ఆ మొత్తం ఎంతనే విషయాన్ని మంత్రి స్పష్టం చేయలేదు. ఇక బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు భారీగా ఆర్థిక సాయం ప్రకటించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ. 15 వేల కోట్లు ప్రత్యేక సాయం అందిస్తామన్నారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో అమరావతికి మరిన్ని అదనంగా నిధులు కేటాయిస్తామన్నారు. ఏపీ విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం ఉంటుందన్నారు. పోలవరానికి కావాల్సిన నిధులు అందిస్తామని చెప్పారు. పోలవరం ఆంధ్రప్రదేశ్‌కు, రైతులకు జీవనాడి వంటిదన్నారు. అది భారత ఆహార భద్రతకు ఎంతో కీలకమైందని చెప్పారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com